RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY　　తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 93 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం, సెప్టెంబర్, 27, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 93 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, September, 27, 2025 | PAGES : 8 RS : 4 /-



## భారత ఫార్మాకు..

# ట్రంప్ షాక్

### మందులపై 100 శాతం సుంకాలు!

**- బ్రాండెడ్ ఔషధాల దిగుమతిపై 100 శాతం సుంకం విధించనున్నట్టు ట్రంప్ ప్రకటన**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఫార్మా రంగానికి భారీ షాక్ ఇచ్చేలా సంచలన నిర్ణయం తీసుకున్నారు. బ్రాండెడ్, పేటెంట్ పొందిన ఔషధాల దిగుమతిపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. అయితే, అమెరికాలో తయారీ ప్లాంట్లను నిర్మిస్తున్న కంపెనీలకు ఈ సుంకాల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం భారత ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## బీహార్‌లో ఎన్నికల

# తాయిలం

- ఒక్కో మహిళ ఖాతాలో పదివేలు
- మహిళా రోజ్‌గార్‌కు ప్రధాని మోడీ ప్రారంభం

న్యూఢిల్లీ/పాట్నా: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఇతర మంత్రులు హాజరయ్యారు. రూ.7,500 కోట్లతో బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకు వచ్చింది. మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పించడం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఈ స్కీమ్ కింద రూ.10వేలు నేరుగా అందాయి. తర్వాత వివిధ దశల్లో ఆ సహాయం రూ.2 లక్షల వరకు ఉండనుంది. స్వయంఉపాధి కోసం పశుపోషణ, వ్యవసాయం, -టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది..



## భారీ వర్షాలపై సీఎం రేవంత్

# సమీక్ష

### అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు ఆదేశం

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ మహానగరంతోపాటు- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని లోతట్టు- ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు- వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ క్రమంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. అలాగే నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. ఆ దిశగా సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలంటూ సీఎస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. అందులోభాగం ఉద్యోగులకు ఈ రోజు.. అంటే శుక్రవారం సాఫ్ట్ వేరు నిపుణులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలంటూ ఐటీ- కంపెనీలను ఇప్పటికే సూచించింది. అలాగే వివిధ ప్రాంతాల్లోని రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ బృందాలు రంగలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.



## హైదరాబాద్‌లో కుండపోత

# వర్షం

**తడిసి ముద్దయిన నగరం**

**ఇబ్బందులు పడ్డ నగర వాసులు**

**పటాన్‌చెరు వద్ద హైవేపై నిలిచిన ట్రాఫిక్**

**కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్**

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. శుక్రవారం కూడా భారీ వర్షం కురుస్తుండటంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం అప్రమత్తమైంది. ట్రాఫిక్ సమస్యలు, ప్రజల భద్రతా దృష్ట్యా వివిధ కంపెనీలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సూచించింది. పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మరోవైపు హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఛత్రినాక, తార్నాక, హబ్సిగూడ, నాచారం, కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్, ప్రగతినగర్, ఆల్విన్ కాలనీ, చార్మినార్, యూకత్‌పురా, ఓయూ క్యాంపస్, హైదర్‌నగర్, బాచుపల్లి, వివేకానంద నగర్, చార్మినార్, చాంద్రయణగుట్ట, బహదూర్‌పురా, లాలాపేట్, మల్లాపూర్, ఉప్పుగూడ, బార్కస్, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది.




## మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జయంతి

# నివాళులర్పించిన మోడీ ఖర్గే, రాహుల్

న్యూఢిల్లీ : నేడు భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జయంతి. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ నివాళులర్పించారు.కాగా, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌జి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను.



## యధాతథంగా ఇసుక

# వ్యాపారం

### ...ాడులకు చలించని అక్రమార్కులు?

**ఆదిలాబాద్, తెలంగాణ దిశ:** ఇసుకకు ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో వ్యాపారు లకు కాసులు కురిపిస్తున్నాయి. గ్రామాలలోని ప్రతి ఒక్కరూ ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి ఇసుక దందాను ఎంచుకుంటున్నారు.ఇసుక రవాణాను అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించడంతో అక్రమ వ్యాపారులు జోరుగా ఇసుక తరలిస్తూ నిల్వ చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా దందా మాత్రం ఆగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ఇసుకను తోడుకుని అమ్ముకోవడంతో వ్యాపారులకు కాసుల వర్షం కురుస్తుంది. ప్రస్తుతం వరదనీరు గంగలోకి రావడంతో ఇసుక తీసే వీలులేక ప్రస్తుతం తాంసి(కె) నుంచి పిప్పల్‌కోటి మీదుగా కప్పర్ల, బండల్‌నాగాపూర్, పొచ్చేర, లేకపోతే సావర్గాం, జంధాపూర్ గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తున్నారు. తాంసి(కె) వద్ద గంగాలోని ఇసుక బాగుండడంతో భారీ రేటు కూడా పలుకడంతో ట్రాక్టర్ల యాజమానులు, వ్యాపారులు పెన్‌గంగ నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. రోజుకు ట్రాక్టర్ ద్వారా ఒక్కో ట్రాక్టర్ ద్వారా రెండు ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రింపు ఇసుకను రూ.3 నుంచి నాలుగు వేలకు విక్రయిస్తున్నారు. ఇలా నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



## తెలంగాణ రాష్ట్ర ప్రజలు

# ఆయురారోగ్యాలతో జీవించాలి

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మంథని,సెప్టెంబర్26: మంథని పట్టణంలో రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం పర్యటించి భక్తిశ్రద్ధలతో పలు దేవాలయాలను సందర్శించారు. మంథని పట్టణం లోమొదటగా మహాలక్ష్మి దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారిని, లలితాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఈసీఐఎల్ లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు







**కుషాయిగూడ, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రజక సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలోని చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, ప్రభుదాస్, బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, నేషనల్ జర్నలిస్ట్ యూనియన్ (ఇండియా) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆ యోధురాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తి అని అన్నారు. భావి తరాలకు మహనీయురాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసం మహిపాల్ రెడ్డి నాగిళ్ల బాల్ రెడ్డి, నీరుకొండ సతీష్ బాబు, షేక్ అబ్దుల్ రహీమ్, కందాడి సుదర్శన్ రెడ్డి, రాములు యాదవ్, పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా ప్రభాకర్ ఆంజనేయులు, కనకరాజు గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, మనమ్మ, రాజిరెడ్డి, లక్ష్మీనారాయణ, యాదగిరిరావు, ఎం. శివానంద్, చంద్రశేఖర్, రాజన్న, బేతాళ బాలరాజు, తెలంగాణ రజక సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శనిగరం అశోక్, రాష్ట్ర అధ్యక్షులు ముంజంపల్లి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజు, సోమయ్య రాష్ట్ర కార్యదర్శి సకినాల రవి, రాష్ట్ర కోశాధికారి జంజీరాల సత్యనారాయణ, రత్నాల కనకయ్య, పెద్దాపురం కుమార్, పైండ్ల సాయి, కొమురయ్య, లింగయ్య, వెంకన్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మీడియా ఆర్ట్స్ కార్యాలయం ప్రారంభం



శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదుబండలో నూతనంగా ఏర్పాటు చేసిన జీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మీడియా ఆర్ట్స్ కార్యాలయాన్ని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మీడియా ఆర్ట్స్ అధినేత కుమార్ యాదవ్, శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షులు మారబోయిన రాజు యాదవ్, గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లేష్ యాదవ్, కొడిచెర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

(శేరిలింగంపల్లి, తెలంగాణ దిశ)

## భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీర మహిళ చాకలి ఐలమ్మ

### - మాజీ శాసన సభ్యులు భిక్షపతి యాదవ్





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి మాజీ శాసనసభ్యులు భిక్షపతి యాదవ్ ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా హాఫీజ్ పేటలో తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి స్ఫూర్తి దాత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కౌలు భూమిని దొర గుండాలు లాక్కోవాలని చూసినప్పుడు ఒంటరిగా ధైర్యంగా నిలబడి గూండాలను తరిమికొట్టి పంటను కాపాడుకున్న ధైర్యశాలి అని అన్నారు. ఆమె పోరాటమే వేలాది మందికి స్ఫూర్తినిచ్చిందని, బహుజన వర్గానికి చెందిన మహిళ సొంతంగా భూమిని సాగు చేయడాన్ని దొరలు సహించలేకపోయినా వారి అహంకారాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నించి, ఆత్మ గౌరవాన్ని సగర్వంగా నిలబెట్టిన ధీర వనిత అని బిక్షపతి యాదవ్ కొనియాడారు. నియోజకవర్గంలో త్వరలో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ జరగాలని, ఇందుకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన మహేష్ యాదవ్, రాజ్ కుమార్, రవి ముదిరాజ్, నవీన్, అశోక్, బిక్షపతి, లక్ష్మణ్, కుమార్ సాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ

### - నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి





**నాగారం, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ)** :వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను శుక్రవారం నాగారంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.బిజెపి నాయకులు జూపల్లి నరేష్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ తెగువ చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. కాళ్ళు మొక్కుతా బాంచన్ అనే పదానికి విముక్తి కల్పించి, స్త్రీ జాతి దీనిలో కూడా తక్కువ కాదని ప్రపంచానికి చాటి చెప్పిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు తడిసిన సూర్య శేఖర్ రెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, వల్లాల శ్రీనివాస్, మామిడి జంగారెడ్డి, సురేందర్ రెడ్డి, కర్ర వెంకటేశ్వరరావు వినయ్ రెడ్డి, రమేష్, జూలకంటి అశోక్ గుప్తా, వినయ్ రెడ్డి, వెంకట చారి, జలీల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తారానగర్ తుల్జాభవాని అమ్మవారి ఉత్సవాలు

### - ముఖ్యఅతిథిగా హాజరైన పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ)** :శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తారానగర్ లో దసరా పర్వదినం సందర్భంగా శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని అమ్మ వారి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి వేడుకలను ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆయన ఆకాక్షించారు. స్థానికంగా ఎంతో ప్రసిద్ధి చెందిన తుల్జాభవాని అమ్మవారి ఆలయ పునరుద్ధరణ పనులను త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుల్జాభవాని టెంపుల్ ఈఓ సత్య చంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షులు మారబోయిన రాజు యాదవ్, గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతకింది రవీందర్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, వార్డ్ మెంబర్ కవిత గోపాల్ కృష్ణ, వార్డ్ మెంబెర్ రాము, పవన్ గుప్త, పాండు, రవి యాదవ్, కృష్ణ, నటరాజ్, కిరణ్ యాదవ్, శేఖర్, సంపత్, మల్లేష్ యాదవ్, శ్రీనాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీపీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు





**ఏఎస్ రావునగర్, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ)** :వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సతీష్ బాబు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాయుధ పోరాటం చేసిన ధీర వనిత అని కొనియాడారు. భూస్వాములకు ఎదురొడ్డి నిలిచిన పోరాట యోధురాలు అన్నారు. అటువంటి మహనీయురాలి ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని కోరుకుంటూ ఆ మహాయోధురాలికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గడ్డమీది రాములు యాదవ్, పనగట్ల చక్రపాణి గౌడ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్, రజక సంఘం నాయకులు శనిగరం అశోక్, కుమారస్వామి, సకినాల రవి, యాకయ్య, చల్లా ప్రభాకర్, చల్లా వెంకటేష్, కనకయ్య, కుమార్, రాజిరెడ్డి, మీడియా మిత్రులు మెరుగు చంద్రమోహన్, చంద్రమౌళి, యావాపురం రవి, ముత్యం ముఖేష్ గౌడ్, నిరంత్ గౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తెగువను చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ : పావని రెడ్డి



**ఏఎస్ రావునగర్, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ)** :భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ తెగువను చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పావని రెడ్డి మాట్లాడుతూ కాళ్ళు మొక్కుతా బాంచన్ అనే పదానికి విముక్తి కల్పించి, స్త్రీ జాతి దీనిలో కూడా తక్కువ కాదని ప్రపంచానికి చాటి చెప్పిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆ యోధురాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తి అని అన్నారు. భావి తరాలకు మహనీయురాలని ఆమె తెలిపారు.


## ఘనంగా బిజెపి మీడియా సెల్ కన్వీనర్ ఆనంద్ గౌడ్ జన్మదిన వేడుకలు





కుషాయిగూడ, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ) :భారతీయ జనతా పార్టీ ఉప్పల్ అసెంబ్లీ మీడియా సెల్ కన్వీనర్తాళ్ల ఆనంద్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఇస్లావత్ హరి నాయక్, చర్లపల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు నాదం, లక్ష్మణ్ గౌడ్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ గౌడ్, సహదేవ్ గౌడ్, రాంబాబు, యాదయ్య, నందు, రాజు, వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు హాజరై జన్మదిన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## మహాలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారు



**నాగారం, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ)** :నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఎస్ వి నగర్ కాలనీ రోడ్ నెంబర్ -7 లోని శ్రీ సాయి అయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ కోమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దారురిహారి కృష్ణమాచార్యులు, లక్ష్మి, మంజుల, శాంతి, లలిత, సుమలత, అనురాధ, సునీత, శ్యామల, ప్రత్యూష, శ్రీదేవి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**నాగారం, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ)** :భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని కాంగ్రెస్ పార్టీ నాగారం మున్సిపాలిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస రెడ్డి అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం నాగారం మున్సిపాలిటీ విజయపురి కాలనీలో దోబీఘాట్ ప్రాంగణంలోని ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నంరాజు రజక సేవా సంఘం నాగారం అన్నంరాజు నరసింహ, రాములు, వెంకటేష్, శ్రీనివాస్, గంగయ్య, రవికుమార్, హరిబాబు గణేష్, అర్జున్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# కర్మ రిటర్న్స్..!

రాజకీయాలు చేయవచ్చు కానీ.. ప్రత్యర్థి పార్టీలు లేకుండా చేయాలని.. వాటిని నిర్వీర్యం చేయాలన్న ప్రయత్నం అత్యంత ప్రమాదకరం. అది వికటిస్తే ఏ స్థాయిలో ఉంటుందో ఇప్పుడు తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కు తెలుస్తోంది. సొంత కుమార్తె కవిత ఆరోపణలతో కెసిఆర్ పార్టీ ఇప్పుడు సతమతం అవుతోంది. ఆ పార్టీ అసలు తెలంగాణలో నిలబడుతుందా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గౌరవప్రదమైన సీట్లను సాధించింది కేసీఆర్ పార్టీ. కానీ అక్కడకు ఎనిమిది నెలల వ్యవధిలోనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కలేదు. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమా అని ఆ పార్టీలో ప్రకంపనలు రేగుతున్నాయి. ఒకవైపు పార్టీ పతనం అవుతుండగా.. మరోవైపు ఆ కుటుంబం సైతం ప్రజల్లో చులకన అవుతోంది. అయితే ఈ విషయంలో కెసిఆర్ మాదిరిగానే జగన్ పరిస్థితి ఉంది.తెలంగాణలో తెలుగుదేశం పార్టీకనుమరుగైతే తప్ప తన పార్టీ బతకదని కెసిఆర్ కు తెలుసు. పోనీ తన మాటను గౌరవించి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నైనా గౌరవంతో చూశారా అంటే అది లేదు. ఆ పార్టీని ఎంత దెబ్బతీయాలో అంతలా తీశారు. కాంగ్రెస్ పార్టీ నేతలతోనే కాంగ్రెస్కు వెన్నుపోటు పొడిపించిన ఘనత కూడా కెసిఆర్ కే దక్కుతుంది. అందుకే కర్మఫలం అనేది ఎవ్వరికీ విడిచిపెట్టదు. ఇప్పుడు కెసిఆర్ కు జరుగుతోంది అదే. ముందు ఆ పార్టీ బతుకుతుందా? లేదా? అన్నది చూడాలి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సైతం తెలుగుదేశం పార్టీని పూర్తిగా నాశనం చేయాలని చూశారు. ఆ పార్టీని దారుణంగా దెబ్బతీయాలని ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. చివరకు ఎన్టీఆర్ కూతురు, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ని నిండు సభలో అవమానించారు. తన సహచరులు దారుణ వ్యాఖ్యలు చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. అంతటితో ఆగకుండా చంద్రబాబును జైల్లో పెట్టించారు. అప్పటి కొందరు కేంద్ర పెద్దల సాయంతో తెలుగుదేశం పార్టీ లేకుండా చేయడానికి పన్నాగం పన్నారు. అయితే ఆయన ఒకటి తలిస్తే.. ప్రజలు ఒకటి తలచినట్టు.. తెలుగుదేశం పార్టీకి విజయం అందించి. జగన్మోహన్ రెడ్డి పన్నాగాన్ని తిప్పికొట్టారు ప్రజలు. అయితే ఇప్పుడు కర్మఫలం జగన్మోహన్ రెడ్డికి సైతం విడిచిపెట్టడం లేదు. ఏ పార్టీని నాశనం చేయాలని చూశారో.. ఏ కూటమి పార్టీలను తక్కువ చేసి మాట్లాడారో.. మీరు నా వెంట్రుక కూడా పీకలేరు అన్నారో.. ఇప్పుడు అదే జరిగింది. కర్మఫలం అనేది జగన్మోహన్ రెడ్డికి వెంటాడడం ప్రారంభించింది.తెలంగాణలో కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్.. ఏపీలో జగన్మోహన్ రెడ్డికి మద్యం కుంభకోణం.. ఈ రెండు ఇప్పుడు వెంటాడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో కాసులు కొల్లగొట్టారు నాటి పాలకులు. మద్యం కుంభకోణంలో 18 వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని పక్కకు తప్పించారు. అందుకే ఇప్పుడు ఏ పార్టీలు నిర్వీర్యం కావాలని కోరుకున్నారో.. ఇప్పుడు అదే పార్టీలు కర్మఫలం రూపంలో వెంటాడుతున్నాయి. కర్మ ఫలం అంటే ఇప్పుడు సరికొత్త నిర్వచనం గా కెసిఆర్, జగన్మోహన్ రెడ్డిలను చూపిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ ప్రాంతీయ పార్టీల జోలికి పెద్దగా వెళ్లదు. తమ పార్టీలో విలీనం చేసుకునేందుకు ప్రయత్నించదు. అవసరమైన సమయంలో ప్రాంతీయ పార్టీలకు చెందిన రాజ్యసభ సభ్యులను తమ పార్టీకి చేర్చుకుంటుంది కానీ, దేశంలో ప్రాంతీయ పార్టీలను తనలో విలీనం చేసుకునే ప్రయత్నం చేయదు. ఎందుకంటే బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆ రాష్ట్రాల్లో ఎక్కువ శాతం ఓట్లు కలిగి ఉంటాయి. జాతీయ పార్టీలకు మించి ప్రాంతీయ పార్టీలకు ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంటుంది. అందుకే వాటిని భయపెట్టో, బతిమాలో తమకు మద్దతును తెచ్చుకునే ప్రయత్నం చేస్తుంది తప్ప విలీనం అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదన్నది ఇప్పటి వరకూ జరిగిన రాజకీయ పరిణామాలు చూసిన వారికి ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది... మహారాష్ట్రలో కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ వంటి సంస్థలతో భయపెట్టి శివసేనను చీల్చింది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీ జోలికి పోలేదు. ఇక ఢిల్లీలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై కేసులు బనాయించి జైల్లోకి తోసి ఢిల్లీలో అధికారంలోకి రాగలిగింది. అదే సమయంలో తమిళనాడులో డీఎంకే జోలికి కూడా పోలేదు. అక్కడ అన్నా డీఎంకేతో పొత్తు పెట్టుకుంది. ఇప్పుడు విజయ్ పార్టీతో పొత్తుకు ప్రయత్నిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోనూ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలతో కూటమితో ఉన్నప్పటికీ అక్కడ కూటమికి ప్రత్యర్థిగా ఉన్న జగన్ జోలికి బీజేపీ వెళ్లడం లేదు. జగన్ మద్దతు ఎప్పటికైనా తమకు అవసరమని భావించడంతోనే పదకొండు నెలల నుంచి జగన్ పై ఉన్న కేసులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తాజాగా తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని కూడా అదే రకంగా దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తుంది. అవసరమైతే పొత్తు పెట్టుకోవడం లేకుంటే తమకు అవసరమైన సమయంలో మద్దతు ఇచ్చేలా వ్యవహరిస్తుందే తప్ప తన పార్టీలో విలీనం చేసుకునే ప్రయత్నం చేయదు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలని బీజేపీ గట్టిగా భావిస్తుంది. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోమని ఇప్పటికే నేతలు స్పష్టం చేశారు. అవసరమైతే రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి రావడానికి అవసరమైన మద్దతు పొందేందుకు మాత్రమే ప్రయత్నిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో జగన్ ను కానీ, తెలంగాణలో కేసీఆర్ ను కాని బీజేపీ తమకు వ్యతిరేకంగా మలచుకోదు. జగన్, కేసీఆర్ లు కాంగ్రెస్‌కు శత్రువులు కావడంతో తమకు మిత్రులుగానే చూడాలనుకుంటుంది. అదే బీజేపీ స్ట్రాటజీ..!

# కన్నీటి కష్టాలు ఇంకెంత కాలం?



బుడమేరు ముంపు బాధితులను నిరుటి పీడకల నేటికీ వెంటాడుతోంది. గత ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ. తెలతెల వారుతూనే ప్రజలను బుడమేరు వరద చుట్టుముట్టింది. మెల్లగా కాదు. వేగంగా. గంటల వ్యవధిలోనే పీకల్లోతున ముంచేసింది. విజయవాడ, పరిసర ప్రాంతాలు రోజుల తరబడి వరద నీటిలోనే ఉండిపోయాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కరెంటు లేక, నీళ్లు లేక అక్కడి నుంచి బయటపడేందుకు విఫలయత్నం చేసిన వారెందరో. అదే సమయంలో కృష్ణా నదితో పాటు పలు వాగులు పొంగి, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల ప్రజలు ముంపుబారిన పడ్డారు. అధికారుల లెక్కల ప్రకారమే బుడమేరు ముంపుతో ఆరున్నర లక్షల మంది నిరాశ్రయులయ్యారు. 2లక్షల 75 వేల ఇళ్లు మునిగిపోయాయి. 50 మంది పైగా మృతి చెందారు. వేలాది కోట్ల రూపాయల ఆస్తి, పంట నష్టం వాటిల్లింది. చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. ఏడాది గడిచింది. ఇంకా జనం కోలుకోలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయి, బయట పడలేకపోతున్న వారెందరో.

పరిష్కారమెక్కడీ: ప్రజల దుఃఖాన్ని సైతం రాజకీయం చేయగలవారున్న చోట కంటి తుడుపు చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం లభించదనేందుకు ఈ ఏడాది కాలంలో పాలకుల వ్యవహార శైలే నిదర్శనం. సంక్షోభాలను సానుకూలంగా మార్చుకోవాలని పదేపదే చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు బుడమేరు వరదలను సైతం ప్రచారానికి, రాజకీయ లబ్ధికే వినియోగించుకున్నారు. పడవల్లో తిరిగారు. కలెక్టరేట్లోనే వారం కాపురం ఉన్నానని ఆర్భాటం చేశారు. కానీ సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవడంలోనూ, ప్రజలందరికీ సహాయం అందించడంలోనూ ఘోరంగా విఫలమయ్యారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు, విధాన లోపాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

భయం అంచునే బుడమేరు బాధితులు: ఏడాది తరువాత కూడా బుడమేరు ముంపు భయం ఆయా ప్రాంత ప్రజలను వెంటాడుతూనే ఉంది. ఇటీవల ఎడతెరపి లేని వర్షం పడినపుడు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యల పేరుతో విజయవాడలో కొన్ని ప్రాంతాల్లో పడవలను ఉంచింది. దీంతో వరదొస్తుందని ఆందోళన చెందిన వేలాదిమంది ఇళ్లలోని సామగ్రిని సర్దుకుని పైఅంతస్థుల్లో తలదాచుకున్నారు. వృద్ధులు, పిల్లలను సురక్షిత ప్రాంతాలను తరలించారు. వాహనాలను బయట ప్రాంతాలకు తరలించేశారు. అయినా పాలకులకు చీమ కుట్టినట్టు లేదు. ప్రజల కష్టం కానని 'విజన్'!: ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ అంటూ ఊదరగొడు తుంటారు. 2047 గురించి ప్రణాళికలు రూపొందిస్తారు. కానీ బుడమేరు ముంపుతో జన జీవనం అస్తవ్యస్తమై ఏడాది గడిచినా, సమస్యకు శాశ్వత పరపరిష్కార చర్యలు చేపట్టరు. ముంపు నివారణకు అధికారులు ఎన్నో నివేదికలిచ్చారు. అవన్నీ ఏమయ్యాయో ముఖ్యమంత్రికే తెలియాలి.

బనకచర్ల సరే.. ఇక్కడ రక్షణ మాటేమిటి?: 80 వేల కోట్ల రూపాయలతో బనకచర్ల లాంటి ప్రాజెక్టులు చేపడతామని ఉత్సాహం చూపుతున్న ముఖ్యమంత్రి బుడమేరు వరద ముంపు నుండి ప్రజలను కాపాడటానికి తక్షణమే తీసుకోవలసిన దీర్ఘకాలిక చర్యల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. బుడమేరు ముంపు సమస్య తలెత్తకుండా సమాంతరంగా మరొక కాలవ తవ్వాలని, రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలని, కృష్ణా నదిలో కలిసే డైవర్షన్ చానల్ లోతు పెంచాలని, దిగువన కొల్లేరు వరకు చానల్ వెడల్పు చేయాలని అధికారులు అనేక నివేదిక లు రూపొందించారు. గతంలో గండి పడిన ఒక ప్రాంతంలో సుమారు రూ.30 కోట్లు ఖర్చు పెట్టి గోడ కట్టి, శాశ్వత చర్యలు పూర్తయినట్లు ప్రభుత్వం నమ్మబలుకుతోంది. ఐదు వేల కోట్లు రూపాయలు తక్షణమే కేటాయించినా పనులు ప్రారంభమవుతాయి. అదీ లేదు. బడ్జెట్లో నిధులే కేటాయించలేదు.

కేంద్రానిదీ అదే వరస: బుడమేరు ముంపు నివారణకు, తక్షణ చర్యలకు రూ. 6,880 కోట్లు సహాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు, ప్రధాని మోడీని కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. ఏడాది గడిచింది. నయాపైసా విడుదల కాలేదు. డబుల్ ఇంజన్ సర్కారుగా చెప్పుకునే ఎన్డీఏ ప్రభుత్వం నిధులు రాబట్టడంలోనూ విఫలమయ్యింది.

సహాయం అందించడంలోనూ వైఫల్యం: వరదల్లో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం లోనూ ప్రభుత్వం విఫలం అయింది. ఆ విపత్తుకు ఎందరో చలించిపోయారు. బాధితులను ఆదుకునేందుకు రాష్ట్రం లోపల, బయట నుండి దాతలెందరో మానవత్వంతో స్పందించారు. రూ. 600 కోట్లకు పైగా విరాళాలు ఇచ్చారు.

## చాకలి ఐలమ్మకు మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 26,(తెలంగాణ దిశ) :**తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం గాంధీభవన్ లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కౌలు భూమిని దొర గుండాలు లాక్కోవాలని చూసినప్పుడు ఒంటరిగా ధైర్యంగా నిలబడి గూండాలను తరిమికొట్టి పంటను కాపాడుకున్న ధైర్యశాలి అని వారు అన్నారు. ఆమె పోరాటమే వేలాది మందికి స్ఫూర్తినిచ్చిందని, బహుజన వర్గానికి చెందిన మహిళ సొంతంగా భూమిని సాగు చేయడాన్ని దొరలు సహించలేకపోయినా వారి అహంకారాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నించి, ఆత్మ గౌరవాన్ని సగర్వంగా నిలబెట్టిన ధీర వనిత అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ జిల్లాల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు నీలం పద్మ, రాజనోళ్ల లక్ష్మి, ఇందిరా శోభన్, సౌజన్య, శ్రీ జ్యోతి, ఇందిర, కవిత, మాధవి, ఉషశ్రీ, అనురాధ, సత్య ప్రసన్న, విజయలక్ష్మి, సంతోష, పార్వతమ్మ, సరళ, జ్ఞానేశ్వరి, శ్రీలత రెడ్డి, యం. లక్ష్మి, దుర్గ భవాని, వనిత తదితరులు పాల్గొన్నారు.



**నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు పరిధిలోని పాత నాగారం మార్కెట్ రోడ్డులో జై భవాని యువ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నాయకులు మెరుగు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణాచారి, జై భవాని యూత్ లీడర్ మహేష్, విజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.**

(నాగారం, తెలంగాణ దిశ)

## స్వచ్ఛమైన ప్రజాసేవే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం : నెమలి అనిల్ కుమార్

### - ఇచ్చిన హామీ ప్రకారం మల్లాపూర్ ఎస్ సి బస్తీ లో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి



**మల్లాపూర్, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ) :**మల్లాపూర్ డివిజన్ ఎస్ సి బస్తీలో గతంలో "బస్తీ బాట" కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం భూగర్భ డ్రైనేజీ పనులను కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ



ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో పూర్తి చేసామని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన పాలనను అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు నెమలి అనిల్ కుమార్ ను ఆత్మీయంగా సత్కరించి హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యం

**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజ కవర్గంలోని మొగుళ్ళపల్లి, టేకుమట్ల, చిట్యాల మరియు గణపురం మండలాల్లోని వివిధ గ్రామాలల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈరోజు ఒక్కరోజే సుమారు రూ.16 కోట్ల 40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు.

అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలక తీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి పరచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాప్రతినిధుల సమన్వ యంతో, ప్రజల భాగస్వామ్యంతో సీఎం నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి దోహదపడుతుం దని తెలిపారు. ఈరోజునాణ్యతతో పాటు సకాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్లు, గుత్తేదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలడబ్బుతో జరుగు తున్న ప్రతి పనిలో పారదర్శకత ఉండాలని, అధికారులు క్రమం తప్పకు ండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణ ంగా అభివృద్ధి పనులు చేస్తూ, ప్రతి గ్రామంలో సమగ్రాభివృద్ధి సాధించ డమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు.

## బతుకమ్మ సంబరాలకు మహిళలు భారీ ఎత్తున తరలి రావాలి

### – పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 26, (తెలంగాణ దిశ):** ఈ నెల 29 సరూర్ నగర్ లో నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ సంబరాలకు మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పిలుపు నిచ్చారు. శుక్రవారం గాంధీభవన్ లో మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అధ్యక్షతన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాళ్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో గిన్నిస్ రికార్డులో భాగంగా పది వేల బతుకమ్మలతో వేడుకలు నిర్వహించడం



జరుగుతుందని సీతక్క తెలిపారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే విధంగా మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిత, మహిళల బలోపేతంపై సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల




అధ్యక్షురాళ్లు నీలం పద్మ, ఇందిరా శోభన్, సౌజన్య, శ్రీ జ్యోతి, ఇందిర, ఆర్. లక్ష్మి, కవిత, మాధవి, ఉషశ్రీ, అనురాధ, సత్య ప్రసన్న, విజయలక్ష్మి, సంతోష, పార్వతమ్మ, సరళ, జ్ఞానేశ్వరి, శ్రీలత రెడ్డి, యం. లక్ష్మి, దుర్గ భవాని, వనిత తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో ఆర్డరా? ఇక బాదుడే..

# డెలివరీ చార్జీలపై 18 శాతం జీఎస్టీ




### ప్రియం కానున్న హోమ్ డెలివరీ సర్వీసులు కస్టమర్లపై భారం వేయనున్న స్విగ్గీ, జొమాటో!

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** జీఎస్టీ 2.0 (వస్తు, సేవల పన్ను) ద్వారా సామాన్యులకు గొప్ప ప్రయోజనాలు తీసుకొచ్చామంటూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఊదరగొడుతున్నది. శ్లాబులతో పాటు ట్యాక్సులనూ తగ్గించినట్టు పైకి ప్రచారం చేసుకొంటున్న కేంద్రం ఇదే సమయంలో కనిపించని విధంగా కొన్ని భారీ వాతలకు తెగబడింది. స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, మ్యాజిక్ పిన్ వంటి ఫుడ్, కిరాణా సర్వీసులను అందించే ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు అందించే డెలివరీ సర్వీసులపై కేంద్రం తాజాగా 18 శాతం జీఎస్టీ విధించింది. ఈ నెల 22 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానున్నది. పెరిగిన డెలివరీ చార్జీలను కస్టమర్ల నుంచి ఆయా సంస్థలు వసూలు చేయనున్నాయి. అంటే, కేంద్రం తాజా నిర్ణయం అంతిమంగా వినియోగదారులపైనే భారాన్ని మోపిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

మోతపై మరో వాత: స్విగ్గీ, జొమాటో తదితర ఫుడ్ డెలివరీ యాప్స్.. కస్టమర్లు ఆర్డర్ చేసిన ఆహారానికి సంబంధించి బేస్ ప్రైస్‌తో పాటు ప్లాట్‌ఫాం ఫీజు, రెస్టారెంట్ చార్జీలు, డెలివరీ ఫీజు, ప్యాకేజింగ్ చార్జీలు, క్యాన్సలేషన్ ఫీజు, రెయిన్ ఫీజు, ట్రాఫిక్ ఫీజు పేరిట ఏవేవో పేర్లు చెప్తూ వినియోగదారుడి నుంచి ఇబ్బడిముబ్బడిగా చార్జీలను వసూలు చేసేవి. అయినప్పటికీ, నగరాల్లో పెరిగిన ట్రాఫిక్, సమయాభావం వంటి కారణంగా పెద్దయెత్తున ఆర్డర్లు వచ్చేవి. దీనికితోడు డెలివరీ చార్జీలపై ఇప్పటివరకూ జీఎస్టీ లేకపోవడంతో కస్టమర్లకు ఒకవిధంగా కొంత మొత్తంలో ఊరట దక్కేది. అయితే, కేంద్రం తీసుకొన్న తాజా నిర్ణయంతో.. డెలివరీ చార్జీలపై 18 శాతం జీఎస్టీ పడింది. అంటే, డెలివరీ యాప్స్ వసూలు చేసే డెలివరీ ఫీజుకు ఈ పన్ను అదనంగా చేరింది. అంటే, హోమ్ డెలివరీ సేవలు ఇప్పుడు మరింత ఖరీదుగా మారనున్నట్టు అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు.. ఏదైనా ఈ-కామర్స్ సంస్థ గతంలో డెలివరీ ఫీజు రూ. 80గా వసూలు చేస్తే, ఇప్పుడు అది రూ. 94 వరకు (జీఎస్టీ 18 శాతంతో) చేరుకొంటుందని నిపుణులు చెప్తున్నారు.

గిగ్ వర్కర్లకు కష్టమే!: 'డెలివరీ చార్జీలపై కేంద్రం 18 శాతం జీఎస్టీని విధించింది. డెలివరీ యాప్స్ ఈ భారాన్ని కస్టమర్లకే బదిలీ చేయవచ్చు. లేకపోతే, ఆహారం లేదా వస్తువులను డెలివరీ చేసే కెప్టెన్ల (డెలివరీ బాయ్స్) కమీషన్లలో కోత విధించవచ్చు' అని ఓ ఫుడ్ డెలివరీ యాప్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ అభిప్రాయపడ్డారు. మరోవైపు, డెలివరీ చార్జీలపై జీఎస్టీ విధించడంతో ఆన్‌లైన్ ఆర్డర్లు తగ్గే ప్రమాదం ఉన్నదని గిగ్ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది అంతిమంగా తమ ఉపాధికే ప్రమాదకరంగా మారొచ్చని చెప్తున్నారు. పెంచిన జీఎస్టీని కస్టమర్ల నుంచి వసూలు చేయడానికి బదులు.. తమ కమీషన్లలో కంపెనీలు కట్ చేసుకొంటే.. ఆర్థికంగా తామే నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం తన నిర్ణయంపై పునరాలోచించాలని డిమాండ్ చేస్తున్నారు.

బట్టల సబ్బులపై శీతకన్ను!: రోజూ వినియోగించే హెయిర్ ఆయిల్, సబ్బులు, ఫేస్ పౌడర్లు, శాంపూలు, టూత్ బ్రష్‌లు, టూత్ పేస్ట్‌లపై ఉన18 శాతం జీఎస్టీని 5 శాతానికి కుదించిన కేంద్రం..

అదే క్యాట గిరీకి చెందిన డిటర్జెంట్లు (బట్టల సబ్బులు, సర్ఫ్, లిక్విడ్), హెయిర్ డై వంటి కాస్మొటిక్స్‌పై జీఎస్టీని 18 శాతంగానే ఉంచడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్ణయం తమకు షాక్‌ను ఇచ్చిందని పారిశ్రామికవర్గాలు పేర్కొంటున్నాయి. డిటర్జెంట్లపై జీఎస్టీని తగ్గిస్తే పేద, మధ్యతరగతి వర్గాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# చేనేత కార్మికుల కొరకు ప్రత్యేక వైద్య శిబిరం

**జమ్మికుంట, తెలంగాణ దిశ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో గల జమ్మికుంట పట్టణంలోనిషత్రంజి చేనేత సంఘంలో గల చేనేత కార్మికుల కొరకు వైద్యాధికారి డాక్టర్ వరుణ, ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరం,ఎన్ సి డి క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది, షత్రంజి చేనేత సంఘంలో గల 115మంది చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు మరియు ఎన్ సి డి పరీక్షలు నిర్వహించడం జరిగింది, ప్రభుత్వ పెన్షన్ తీసుకుంటున్న కార్మికులకు ఎన్సీడీ పరీక్షలు నిర్వహించడం జరిగింది, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న చేనేత కార్మికులకు మందులు ఇవ్వడం జరిగింది. డాక్టర్ చందు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శిబిరాన్ని సందర్శించి చేనేత కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత సీజనల్ డిసీజెస్ (వర్షాకాలంలో సంభవించే వ్యాధుల) మీద డ్రై డే మీద అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ మందులు ప్రభుత్వం అందించే మందుల నే వాడాలని తద్వారా ఆర్థికంగా భారం తగ్గించుకోవచ్చని ప్రభుత్వ మందులు సమర్థవం తంగా పనిచేస్తాయని,

ఆరోగ్య మహిళా కార్యక్రమం ప్రతివా రం, శుక్రవారం ఆరోగ్య ఉప కేంద్రాలలో జరుగుతుందని మహిళలం దరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వరుణ, డాక్టర్ మహెూన్నత పటేల్, హెల్త్ ఎడ్యుకేటర్స్ మోహన్ రెడ్డి, పంజాల ప్రతాప్ గౌడ్, షత్రంజి చేనేత సంఘం అధ్యక్షుడు ఉడుత రమేష్, సూపర్వైజర్ అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎంలు మంజుల, రజిత, మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలి



### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** గోదావరి పుష్కరాలను విజయవంతం గా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందిం చాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు ఐడిఓసి కార్యాల యంలోగోదావరి పుష్కరాలు నిర్వహణకు శాఖల వారిగా చేయాల్సి న ఏర్పాట్లుపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, అగ్నిమాపక, వైద్య, ఆర్టీసీ, విద్యుత్తు, ఉద్యాన, ఆర్ అండ్ బి, మహిళా సంక్షేమ, జాతీయ రహదారులు, మత్స్య, దేవాదాయ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2027 సంవత్స రంలో జరుగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాది భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో ముం దుగానే భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై సమగ్ర కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, శానిటేషన్, వైద్య, రవాణా, భద్రత తదితర సౌకర్యాలను సమగ్రంగా కల్పించాల్సిన అవసరం ఉన్నందున రానున్న 3 రోజుల్లో చేపట్టాల్సిన పనులపై అంచనా నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా ఘాట్ల వద్ద శుభ్రత, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, తాత్కాలిక వసతి గృహాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే దిశగా తక్షణం శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలి

### ప్రతిపనీ సర్పంచ్ పర్యవేక్షణలో సాగాలి

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** త్వరలోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్న ప్రభుత్వం గ్రామాలను బలోపేతం చేసేలా సర్పంచ్ వ్యవస్థను పటిష్టం చేయాల్సి ఉంది. గ్రామాలపై అదేపనిగా పెత్తనం చేయకుండా సాగాలి. కులవృత్తు లను,గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొదిస్తే తప్ప గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయలేం అని పలువురు ప్రముఖులు చెబుతున్నా రు. వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సి ఉంది.గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు, నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని గుర్తించాలి. గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యక్రమా లను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్‌లకు ఉండాలి. పల్లెలో చేపడుతున్న ఏ కార్యక్రమం అయినా, అంతా అధికారుల పర్యవేక్షణలోనే సాగుతోంది. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుకోవాలన్న సర్కార్ నిర్ణయంతో గ్రామాల్లో పారిశుద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలోఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామీణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలకాలి. ఉపాధిహామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచా యతీల్లోపారిశుద్ధ్య పనులను ఉపాధికూలీలతో నిర్వహించాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఇకపోతే గ్రామాల్లో సర్పంచ్‌ల బాధ్యత నామ మాత్రంగా ఉంటోంది. వారికి బాధ్యత అప్పగిస్తే పన్నుల వసూళ్ల మొదలు కార్యక్ర మాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్ధంగా

శిక్షించేలా చట్టం రూపొందించిన ప్రభుత్వం నిధుల కోసం కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాల్లో పన్నులు ఇతరత్రా రూపంలో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదు. గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగితే తప్ప నిధులు సమకూరవు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామీలో పారిశుద్ధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలో నే అధికారులు పనిచేసేలా చూడాలి. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది.పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించు కోవచ్చని నిపుణులు అంటున్నారు. వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయంతో పంచాయతీలు బలోపేతం కావడంతోపా టు వాటికి ఆర్థికభారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. ఈక్రమంలో అధికారులు పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించుకోవాలని కోరుతున్నారు.ఈ నిర్ణయంతో అటు కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏం పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి అధికారుల నిర్ణయం ఊరటనిస్తోంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించ వచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని గతంలోనే సర్పంచులు సైతం అంగీకరించారు. వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నా రు.

ఇంతకాలం వంద రోజుల పనులు చేపట్టని కూలీలకు ఏవిధంగా పని చూపించాలనే ఆలోచిస్తున్న ఉపాధి సిబ్బందికి అధికారుల నిర్ణయం వూరటనిస్తోంది. కూలీలకు ప్లలెల్లోనే పారిశుధ్య పనులు చూపించవచ్చు. అలాగే చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులతో ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

## శాంతియుత వాతావరణం

# శ్రీరామరక్ష..!

**తిరుమల, తెలంగాణ దిశ :** కుటుంబాల సముదాయమే సమాజం. కుటుంబసభ్యుల సత్ప్రవర్తన సమాజానికి శ్రీరామరక్ష. ఇంటి యజమాని ధర్మపరుడైతే సంతానం అదే బాటలో నడుస్తుంది. గృహస్థుడి వ్యక్తిత్వమే గృహానికి ఆలంబన. గృహిణి సహనశీలతే ఇంటి సౌభాగ్యం. ఇటుకలతో కట్టినంత మాత్రాన ఇల్లు ఇల్లు కాదు. సత్యం, ధర్మం పునాదులపై ఇల్లు నిలబడాలి. ఆప్యాయతానురాగాల గోడలుండాలి. దయ, శాంతం ఇంటికి అలంకారాలు కావాలి. శుభ కార్యాచరణ, పరోపకారత్వం కుటుంబసభ్యుల జీవనరాగం కావాలి. విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న పిల్లలతో ఇల్లు కళకళలాడాలి. వృద్ధులను ఆదరించే గృహాలలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. భగవన్నామస్మరణతో అలరారే గృహాల నుంచి వెలువడే ఆధ్యాత్మిక సంపద సమాజాన్ని పావనం చేస్తుంది. అలాంటి సమాజమే దేశానికి అవసరం. ప్రతి ఒక్కరూ తమవంతుగా ధర్మబద్ధులుగా ఉండాల్సిన అసవరం ఉంది. అప్పుడే సమాజంలో శాంతి సాధ్యం అవుతుంది. ఆవు తనకు కట్టిన పలుపుతాడు తెంచుకొని వెళ్ళిపోవాలనుకుని అటు, ఇటు చుట్టూ తిరుగుతుంది. చివరకు తన పరిధి తాను తెలుసుకుని చతికిలపడుతుంది. మన నిస్సహాయతను మనం తెలుసుకోవాలి. అదే సమయంలో మనల్ని ఇలా ఉంచినవాడి గొప్పదనాన్ని గ్రహించాలి. ఎవరిమీదో కోపం వస్తుంది. ఎందుకో కోపం వస్తుంది. పారిపోవాలని అనిపిస్తుంది. తాళ్లతో కట్టి బంధించ రెవరూ! అయినా వెళ్ళలేం. ఎందుకు, ఎవరు మనల్ని ఆపుతున్నారో తెలియదు. చూసిన ముఖాలే చూస్తూ, ఆడిన మాటలే ఆడుతూ, అదే తిండి తింటూ, నిద్రపోతూ తెల్లవారి లేచి మరో కొత్త సూర్యుడి కోసం ఎదురు చూస్తాం. ఇదే బంధం. మౌలికంగా మనిషి బతకడంలోనే బంధం ఉంది. అందం ఉంది. బంధాలు అందంగా ఉంటాయి. అవి ఇనుప గొలుసులైతేనేం, బంగారు గొలుసులైతేనేం- బంధాలు బయటకు కనిపించవు. తల్లి వెంట బిడ్డ, బిడ్డ వెంట తల్లి...ఆ బిడ్డ ఎదిగి తల్లి...అలా అందరూ కలిసి కుటుంబం. ఈ కుటుం బాలన్నీ ఈశ్వరుడివే. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మనసు వైరాగ్యానికి గురి అయినప్పుడు తట్టా బుట్టా సర్దుకుని ఎక్కడికైనా వెళ్ళిపోదాం అనిపిస్తుంది. కానీ, అంతలోనే ఆగిపోవాలి అనిపిస్తుంది. కనపడకుండాఆపేదెవరని ఆలోచిస్తే- మనవాళ్లే కా దు... మనమధ్యలో ఉండే బంధమే అనిపిస్తుంది...

# లక్ష్యం చేరని సంపూర్ణ అక్షరాస్యత?



ఏ దేశమైనా అక్షరాస్యతను కలిగివుంటేనే అభివృద్ధి చెందుతుంది. దేశంలో నిరక్ష్యరాస్యతను తొలగించిన నాడే పురోగమిస్తుంది. ప్రతి ఏటా సెప్టెంబర్ 8వ తేదీని 'అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే సంపూర్ణ అక్షరాస్యత విషయంలో కేంద్ర,రాష్ట్రాలు ఇంకా పూర్తిస్థాయిలో కృషి చేయడం లేదు. గ్రామాల వారీగా అక్షరాస్యతకు కృషి చేయడం లేదు. నవంబర్ 17, 1965 సంవత్సరంలో యునెస్కో సభ్యదేశాల విద్యాశాఖ మంత్రు ల మహాసభ అనంతరం అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రకటించగా 1966 నుండి జరుపుకుంటున్నాం. అక్షరాస్యత అంటే సాంప్రదా యకంగా భాషను ఉపయోగించేందుకు అవసరమైన చదవటం, రాయటం, వినటం, మాట్లాడటం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసుకోవటాన్నే అక్షరాస్యత అనవచ్చు. అయితే మనిషి దైనందిన జీవితంలో ఈ రాయడం, చదవటం మాత్రమే అక్షరాస్యత అనేది కాదనీ, అక్షరాస్యత అంటే మనిషి గౌరవం, అవకాశాలు, అభివృద్ధి గురించి చెప్పడమే నిజమైన అక్షరాస్యత అని కొంతమంది పెద్దలు చెబుతుంటారు. ఉన్నతమైన జీవనానికి ప్రపంచం అన్నిరంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరం. అయితే ప్రపంచంలో కొన్ని దేశాలు వెనుకబడి ఉండడానికి నిరక్షరాస్యత ముఖ్యకారణం. అలా వెనకబడిన దేశాలను ముందుకు తీసుకురావడానికే అక్షరాస్యతను శాతాన్ని పెంచాలి. ఇది పిల్లల్లోనే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరించబడింది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం అగాధంలో వున్నట్లే చెప్పవచ్చు. ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే దానిక్కారణం కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుం డటం తప్ప మరోటి కాదు. అనేక రాష్ట్రాలు సగటు అక్షరాస్యతా శాతానికి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మొత్తం మీద ప్రపంచ నిరక్షరాస్యుల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. గతంలో వయోజన విద్యకు ప్రాధాన్య ఇచ్చే వారు. ఈ మధ్య అది కనిపించడం లేదు. ప్రతి ఒక్కరిని అక్షరాస్యులను చేయాలన్న సంకల్పం యేరకు గ్రామస్థాయిలో సర్వేచేసి పిల్లలను బలవంతంగా స్కూళ్లకు చేర్చారు. అలాగే పనిప్రదేశాల్లో బాలకార్మికు లను లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలనపెంచి ఇద్దరుఉపాధ్యాయులు ఉండేలా,కేవలం అక్షరజ్ఞా నం కలిగించేలా చూడాలి. ఏటా ఉత్సవాలు జరపడంతో పాటు చేస్తున్న కృషికి అనుగుణంగా అక్షరాస్యత పెరిగిందా లేదా అన్నది బేరీజు వేసుకోవాలి.స్థిరమైన ఆర్థికాభి వృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధిం చాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 79ఏళ్లు గడుస్తున్నా సంపూర్ణ అక్షరాస్యతను సాధించలేదు. అందరూ చదివినప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం అగాధంలో వున్నట్లే చెప్పవచ్చు.ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే దానిక్కారణం కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుండటం తప్ప మరోటి కాదు. ప్రపంచ నిరక్షరాస్యుల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. ప్రధానగా విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్రాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ కేటాయింపును తగ్గించే స్తున్నాయి. జనాభాకు అనుగుణంగా విద్యారంగ అభివృద్ధి జరగడం లేదు. విద్యారంగంలో విప్లవం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా..మార్పులు మాత్రం కానరావడం లేదు. ఎందుకనో పాలకులు ఎవరు అధికారంలో ఉన్నా ఈ రంగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫీజుల దోపిడీపై గళమెత్తు తున్నా పట్టించుకోవడం లేదు. కార్పోరేట్ స్కూళ్ల పేరుతో చేస్తున్న దోపిడీ అంతాఇంతా కాదు. తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక పట్టాలకెక్కడం లేదు. ఎపిలో జగనన్న విద్యా కానుక తప్ప స్కూళ్ల బలోపేతం జరగలేదు.

ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదివిన వారు మత్రమే టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో గమనించాలి. దీనివెనక ఏదైనా గూడుపుఠాణి ఉందా అన్నది బయటపెట్టాలి. ప్రభుత్వ రంగంలో ప్రాథమిక విద్యకు బలమైన పునాదులు పడాలి. అలాగేకార్పోరేట్ దోపిడీని అరికటటాలి. అప్పుడే విద్యారంగం విస్తృతం కాగలదు. సామాన్యుడి నుంచి, రాజకీయనాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యావిధానంలో చదవాలన్న ఆకాంక్ష అమలు కావడం లేదు.

విద్యాభివృద్దిలో కులరహిత హాస్టళ్లు ఉండకూడదు. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. అయితే ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉండగానే గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, అనేక హాస్టళ్లను కొత్తగా చేపట్టడం వల్ల సమగ్ర విద్యాపథకం అటకెక్కిందనే భావించాలి. సమగ్రమైన విద్యతో పాటు, విద్యార్థి అన్ని రంగాల్లో రాటుదేలేలా విద్యా సంస్కరణలు రావాలి. ప్రతి ఒక్కరూ చదవడం,రాయడం లక్ష్యంగా ముందుకు సాగాలి. కనీసం పేపర్ చదవగలిగేలా చేయాలి. ఇంటర్‌నెట్ విస్తృతి పెరిగినా ప్రభుత్వ ప్రోత్సాహం దక్కడం లేదు. అయితే గతంతో పోలిస్తే విద్యారంగం లో అనేక విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. గురుకులాల ఏర్పాటు వల్ల సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి వచ్చింది. దానిని కాదనలేం.

అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. గురుకుల విద్యాలయాలు పెరిగాయి. ఒక్కొక్క విద్యార్థిపై ఏటా ఒక లక్ష రూపాయలు వెచ్చిస్తున్నారు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు లభిస్తున్నాయి. చదువుకుంటే నిరుద్యోగిగా మిగిలిపోతున్న ప్రస్తుత తరుణంలో ఉపాధికి తగ్గ చదువు దక్కేలా చేయాలి. చిత్తశుద్ధి ఉంటే తప్ప విద్యారంగాన్ని మార్చలేం. అందరికీ విద్య అన్నది ప్రాథమిక హక్కుగా ఉన్నా, ఆచరణలో సాధ్యం కావడంలేదు. దీనిని ఆచరణలోకి తీసుకుని వచ్చేలా చర్యలు తీసుకుంటే తప్ప సంపూర్ణ అక్షరాస్యత సాధ్యం కాదు.

# సేవా దృక్పథాన్ని పెంపొందిస్తున్నాం



'మారుతున్న నేటి సమాజంలో మనిషి జీవన శైలిలో వచ్చిన అనూహ్య మార్పులతో కొత్త రోగాలు, వైరస్‌లు వంటివి వస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల నుంచి ప్రజలను రోగ విముక్తులు చేయాలంటే నిపుణులైన వైద్యులు అత్యాధునిక వైద్య సేవలు అందించాలి. అందుకే ఆ దిశగా మేము నిరంతరం భావి భారత నిపుణులైన వైద్యులను తయారుచేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం' అని విజయ వాడలోని డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. యూనివర్శిటీ 27,28వ స్నాతకోత్సవం జరగనున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తితో సంభాషించారు. వివరాలు ఆయన మాటల్లోనే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దేశంలో వైద్య విశ్వ విద్యాలయాల్లో మొట్టమొదటిది. అతి పెద్దది కూడానూ. ప్రపంచవ్యాప్తంగా నిరంతరం వైద్య రంగంలో వస్తున్న మార్పులను అన్వయించుకుంటూ నాణ్యమైన, పారదర్శకమైన, సృజనాత్మక వైద్య వైద్యను అందిస్తున్నాం. యూనివర్శిటీ పరిధిలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బిఎస్‌సి) మూడేళ్లు, బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడికల్ సైన్సెస్ (బిఎఎంస్) 5 ఏళ్లు, బ్యాచిలర్ ఆఫ్ యునాని మెడిసిన్ అండ్ సర్జరీ (బిఎఎంఎస్) మూడేళ్లు, మాస్టర్ ఆఫ్ సర్జరీ (ఎంఎస్) రెండేళ్లు, ఎంబిబిఎస్ ఐదేళ్లు, బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రీ (బి.ఆప్టమ్) నాలుగేళ్లు, బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సైన్స్ (బిడిఎస్) నాలుగేళ్లు, మాస్టర్ ఆఫ్ డెంటల్ సైన్స్ (ఎండిఎస్) కోర్సులు కొనసాగుతున్నాయి. యూనివర్శిటీ పరిధిలో 356 వరకూ అనుబంధ కళాశాలలు కూడా ఉన్నాయి. వీటిలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, డాక్టోరల్, సూపర్ స్పెషాలిటీ, డెంటిస్టిటీ, పిహెడ్‌డి వంటి 129 వరకూ కోర్సులు ఉన్నాయి. యుజిసి గుర్తింపుతోపాటుగా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సి), సెంట్రల్ కౌన్సిలర్ ఆఫ్ హెూమియోపతి (సిసిహెచ్), సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ (సిసిఎం)తోపాటుగా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) ద్వారా గుర్తింపు పొందిన యూనివర్శిటీ. ఆయా సంస్థల మంచి ర్యాంకింగ్ కూడా ఇచ్చాయి. 'వైద్యో నారాయణ హరి' అని పెద్దలు అంటారు. ఎందుకంటే అనారోగ్యంతో బాధపడే రోగులకు సాంత్వన చేకూర్చి మెరుగైన ఆరోగ్యాన్ని ప్రసాదించేందుకు కృషిచేసేది డాక్టర్లే. యూనివర్శిటీ ద్వారా అలాంటి వైద్యులను తయారుచేసే కృషిలో నిరంతరం భాగస్వాములు కావటం ఎంతో సంతోషంగా ఉంది. డాక్టర్లకు వైద్య వృత్తి పట్ల నిబద్ధత, సేవానిరతి, నిరాడంబరత, నిజాయితీ అద్వితీయమైనవి. అలాంటి సుగుణాలు కూడా పెంపొందించేందుకు కృషిచేస్తున్నాం. రోగి, వైద్యుని బంధం సహృద్భావంతో ఉండాలి. ఈ తరహాలో చాలామంది ప్రముఖులు పనిచేసి ఆదర్శప్రాయులుగా నిలిచారు. ఇలాంటి వైద్యులను ఆదర్శంగా తీసుకుని వైద్య వృత్తిని సేవాదృక్పథం, నిబద్ధత, అంకితభావంతో నిర్వర్తించటానికి కృషి చేయాలని ప్రోత్సహిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య విధానాలకు అనుగుణంగా, వైద్య విద్య పద్ధతులను అవలంభిస్తున్నాం. జాతీయ, అంతర్జాతీయ వైద్య ఆరోగ్య దినోత్సవాల రోజుల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు, వివిధ రకాల వైద్య సేవల నిమిత్తం ఉచిత వైద్య శిబిరాలు వంటివి ఏర్పాటుచేస్తున్నాం. ఆరోగ్య పరిరక్షణ పట్ల ఆధునిక సమాజంలో చైతన్యం పెరుగుతోంది. అయితే ఇంకా పెరగాల్సిన అవసరం కూడా ఉంది. అందుకే వైద్య విద్యార్థులు కోర్సులోనూ, పూర్తయ్యాక కూడా వైద్య చికిత్సల్లో నిపుణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. గాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేషన్‌లోనూ, రీసెర్చర్లకు కూడా ఇతే తరహాలో నాణ్యమైన వైద్యం నేర్చుకోవటం, నేర్చుకున్న పద్ధతులను రోగుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కృషిచేసేలా ప్రోత్సహిస్తున్నాం.

**ఆధునాతన వైద్యానికి ప్రాధాన్యత:** మారుతున్న టెక్నాలజీని అన్వయించుకుని యూనివర్శిటీ పరిధిలోని కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో వైద్య విద్యలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నాం. గడిచిన 19 ఏళ్ల యూనివర్శిటీ వైద్య విద్యా ప్రయాణంలో అనేక అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి. ఈ యూనివర్శిటీ ద్వారా వైద్య పట్టాలు పొందినడాక్టర్లు నేడు దేశ విదేశాల్లోచాలా పెద్దడాక్టర్లుగానూ, అత్యుత్త ములుగానూ నిలుస్తున్నారు. యూనివర్శిటీలో చదువుకొని పురోగమ నంలో వేలాది డాక్టర్లు నేడు సమాజంలో ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ రంగాల్లో వైద్యసేవలుఅందిస్తుండటం ఎంతో శుభపరిణా మం. రాబోయేకాలంలోనూ ఇలాంటి కృషిని కొనసాగిస్తూనే ఉంటాం.

**సుదీర్ఘ ప్రయాణం:** విజయవాడ కేంద్రంగా డాక్టర్ నందమూరి తారక రామారావు పేరుతో ఆరోగ్యశాస్త్ర విశ్వవిద్యాలయం 1986లో ఏర్పాటైంది. 1998 ఫిబ్రవరి 2వ తేదీ నుండి డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా పనిచేస్తోంది. అన్ని కోర్సుల్లో పరిశోధన, ఏకరీతి పాఠ్యప్రణాళికను అమలు చేయడంతో సహా వైద్య విద్య ప్రమాణాలను మెరుగుపర్చటం విశ్వవిద్యాలయం ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతోంది. కార్యాలయ క్యాంపస్ సిద్ధార్థ మెడికల్ కాలేజీ భవనంలో మార్చి 2002 వరకూ ఉంది. ఆ తర్వాత ఏప్రిల్ 2002 నుంచి ప్రస్తుత భవనంలోకి మారింది.

**నేడు 27,28వ స్నాతకోత్సవం:** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27, 28 వ స్నాతకోత్సవం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానుంది. రాష్ట్ర గవర్నర్, విశ్వ విద్యాలయ కులపతి జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించనున్నారు. ఢిల్లీలోని నేషనల్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అండ్ చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఒపి యాదవ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేయబోతున్నాం. వచ్చే ఏడాది నుంచి ఏటేటా స్నాతకోత్సవం నిర్వహిస్తాం. యూనివర్శిటీలో రీసెర్చ్ యాక్టివిటీస్ కోసం రూ.75 లక్షల గ్రాంట్ ఇచ్చాం. 2021, 2022 సంవత్సరాలకు సంబంధించిన 27వ, 28 వ స్నాతకోత్సవాలను ఒకేసారి నిర్వహిస్తున్నాం. 21వ స్నాతకోత్సవానికి సంబంధించి 53 మంది విద్యార్థులకు 72 మెడళ్లు (55 గోల్డ్,17 సిల్వర్), 18 క్యాష్ ప్రైజ్‌లు,28 వ స్నాతకోత్సవానికి సంబంధించి 67 మంది విద్యార్థులకు 84 మెడళ్లు (60 గోల్డ్, 24 సిల్వర్), 20 క్యాష్ ప్రైజ్‌లు అందించనున్నాం. ఐదుగురికి పీహెచ్ డీ పట్టాలు, సూపర్ స్పెషాలిటీలో ఒకరికి డిగ్రీ అందించబోతున్నాం.మెడల్లకు ఎంపికైన వారికి ఇప్పటికే సమాచారాన్ని అందించాం. వారందరికీ వేదికపైన అతిథుల చేతులమీదుగా బహుమతులు,పట్టాలు అందించబోతున్నాం. విశ్వవిద్యాలయానికి కొత్త కార్యనిర్వాహక మండలి కూడా ఏర్పాటైంది. అందరినీ సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలో వైద్య విద్యను మరింత ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లటానికి నిరంతరం కృషిచేస్తున్నాం.

## మంథని సర్కిల్ పోలీసులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు..!

### -హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ

**మంథని, తెలంగాణ దిశ :** మంథని సర్కిల్ పోలీసులపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మంథని మాజీ ఉపసర్పంచ్, లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణతెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన న్యాయవాదిగా ఉండి,వికలాంగుడైన తనపై తప్పుడు క్రిమినల్ కేసులు నమోదు చేసి,ఇప్పటికి అక్రమంగా ఫోన్ ట్యాపింగ్, నిఘా, వేధింపులు, మీడియా ద్వారా అపకీర్తి కలిగించడంతో పాటు రాజకీయ ప్రభావంతో మంథని సర్కిల్ పోలీసులు, కొంత మంది ప్రైవేటు వ్యక్తులు మానవ హక్కులను ఉల్లంఘించడం సంబంధించి మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993 సెక్షన్ 12మరియు జాతీయ వికలాంగుల చట్టం 2016 ప్రకారం తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ జాతీయ మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేసినట్టు హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ తెలిపారు.ఈ మేరకు తనపై అక్రమ కేసులు నమోదు అయి సరిగ్గా ఏడాది గడుస్తున్న సందర్భంగా గతంలో తాను రాష్ట్ర డీజిపి కి, రామగుండం పోలీస్ కమిషనర్ కి పలు ఫిర్యాదులు చేసి నెలలు గడుస్తున్న ఎలాంటి చర్యలు చేపట్టక పో వడం, ఫిర్యాదులు తిరిగి తిరిగి ఆరోపణలు వచ్చిన వారి వద్దకే విచారణకు రావడం పట్ల చర్యలు తీసుకోవాలని కోరుతూ భాద్యులైన మంథని సర్కిల్ పోలీసులుగా పని చేసిన మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బొల్లపల్లి రాజు,మంథని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ దేగల రమేష్ (5133),మంథని పోలీస్ స్టేషన్,రామగిరి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పెట్టెం చంద్రకుమార్ (7179) తో పాటు మరో 7గురిని ప్రతివాదులుగా చేరుస్తూ మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993 ప్రకారం, జాతీయ వికలాంగుల చట్టం 2016 ప్రకారం జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ కి పిటిషన్ ఇవ్వడం జరిగిందన్నారు.అదేవిధంగా రాజకీయ ఒత్తిడితో, కుట్రలు చేసి కేవలం రెండు వారాల్లోనే ప్రతివాదులు, పోలీసులు నాలుగు తప్పుడు కేసులు నమోదు చేయడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులుగా బాధ్యతాయుతంగా, చట్ట పరిధిలో ప్రవర్తించకుండా మంథని సర్కిల్ పోలీసులు మీడియ పరంగా అతి ఉత్సాహం చూపి స్వయంగా ప్రెస్ మీట్లు, ప్రెస్ నోటీసులు జారీ చేసి, ఏ కేసుల్లో గతంలో కానీ ప్రస్తుతం కానీ మీడియాకు వార్తలకు లేని ప్రచారాన్ని తన కేసుల్లో కల్పించడమే కాకుండా,సోషల్ మీడియా లో వచ్చే తప్పుడు ప్రచారాన్ని కూడా అడ్డుకోలేక పోయారన్నారు.అంతేకాకుండా ఎవరూ కూడా తనతో టచ్ లో ఉండకూడదని, తనయొక్క సెల్ ఫోన్ నంబర్లను ట్యాప్ చేస్తున్నామని, లొకేషన్ ట్రాక్ చేస్తున్నామని చెప్తూ, సర్కిల్ అధికారి తన స్వంత సెల్ నంబర్ నుండి తనయొక్క వివిధ సెల్ నంబర్స్ కు ఇప్పటికి కాల్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ,ఆర్టికల్ 14, 19, 21 హక్కులు ఉల్లంఘించిన విషయంలో చర్యలు తీసుకొని చట్ట పరంగా రక్షణ కల్పించాలని అట్టి పిటిషన్ లో ఇనుముల సత్యనారాయణ కోరారు.

## కళాశాలలు, వసతీ గృహాలలో ముఖగుర్తింపు హాజరు అమలు



**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ:** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల యు-డైస్ నమోదు, విద్యార్థులు, సిబ్బంది ముఖ గుర్తింపు హాజరు నమోదు నూరు శాతం అమలు కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో విద్యార్థులు వివరాలు యు-డైస్ లో నమోదు, ముఖ గుర్తింపు ద్వారా విద్యార్థులు, సిబ్బంది హాజరు నమోదు, అడ్మిషన్ల పురోగతి, ఉత్తమ ఫలితాల సాధన, సౌకర్యాల కల్పన వంటి అంశాలపై జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సంక్షేమ అధికారులు, మోడల్ ఇంటర్ కళాశాలలప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హాజరు, ప్రతి ఉపాధ్యాయుని సమయపాలన పారదర్శకంగా నమోదు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ముఖ గుర్తింపు నమోదును నూరు శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ గుర్తింపు ప్రక్రియ వల్లవిద్యార్థుల, సిబ్బంది హాజరు నమోదులో పారద ర్శకత ఉంటుందని తెలిపారు. ఇంటర్ లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత, నూరుశాతం ఫలితాలు సాధించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఉజ్జ్వలనభవిష్యత్తు కల్పనలో భాగంగా లెక్చరర్లు ప్రతి విద్యార్థిఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 34 జూనియర్ కళాశాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 1644 మంది, ఇంటర్ రెండోసం వత్సరంలో1566 మంది విద్యార్థు లు విద్యానభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ విజయలక్ష్మి,ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న, డీఈఓ రాజేందర్, అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, మోడల్ కళాశాలల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న మానసిక రుగ్మతలు

ప్రపంచవ్యాప్తంగా చనిపోతున్న ప్రతి వంద మందిలో ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ 'వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే-మెంటల్ హెల్త్ అట్లాస్ 2024' నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మంది వివిధ మానసిక ఆరోగ్య రుగ్మతలతో జీవిస్తున్నారని తెలిపింది. ఆందోళన, ఒత్తిడి వంటివి ప్రజలను వెంటాడుతున్న మానసిక రుగ్మతలలో ప్రధానమైనవని కూడా గుర్తించింది. 2011-2021 మధ్య కాలంలో మానసిక రోగుల సంఖ్య ప్రపంచ జనాభా పెరుగుదల కంటే వేగంగా పెరిగింది. మన దేశంలో మానసిక అనారోగ్యం కలిగిన ప్రతి లక్ష మందికి 13 మంది మాత్రమే ఆరోగ్య సిబ్బంది ఉన్నారు. 2024-25 ఆర్థిక సర్వే సైతం మానసిక ఆరోగ్య సంరక్షణపై ఆందోళన వ్యక్తం చేసింది. యువత మానసిక శ్రేయస్సు దేశ ఆర్థిక అభివృద్ధికి కీలకమైన అంశమని ఆర్థిక సర్వే పేర్కొంది. పని ప్రదేశంలో ఒత్తిడి, సోషల్ మీడియా వినియోగం పెరగడం, పెరుగుతున్న సామాజిక, ఆర్థిక ఒత్తిళ్ల వలన యువత మానసిక ఆరోగ్యంపై తగినంత శ్రద్ధ పెట్టడం లేదు. మానసిక ఆరోగ్య సేవలపై కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలో తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నది. 2024-25 బడ్జెట్లో రూ.90,659 కోట్లు కేటాయిస్తే, 2025-26 బడ్జెట్లో రూ.99,859 కోట్లు కేటాయించింది. పైగా గత ఐదు సంవత్సరాలుగా మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం కేటాయిస్తున్న నిధులలో ఎక్కువ భాగం ఖర్చు కావడం లేదనే ఆరోపణలు వున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కేటాయింపులు చేయకుండా మానసిక ఆరోగ్య సంరక్షణ ఎలా సాధ్యం? మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ వంటి సంస్థలకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నది. మరోవైపు కేటాయించిన నిధులను విడుదల చేయడం లేదు. దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్యంపై టెలి కౌన్సిలింగ్ అందించడానికి 2022లో టెలి మానస్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2025 ఫిబ్రవరి నాటికి 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 53 సెంటర్ల ద్వారా టెలి కౌన్సిలింగ్ అందించారని అంచనా. వాస్తవానికి మానసిక అనారోగ్యం కలిగిన వారందరికీ టెలి మెడిసిన్ సేవలు చేరడంలో నిర్లక్ష్యం ఉంది. నిధుల కొరత వలన అనేక రాష్ట్రాల్లో టెలి కౌన్సిలింగ్ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. 1982 నుండి జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం అమలవుతున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 767 జిల్లాల్లో అమలవుతున్నది. దీనిని సమర్థవంతంగా నిర్వహించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ప్రధాన ఆటంకంగా ఉంది. భారతదేశంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు మానసిక ఆరోగ్య సంరక్షణ కీలకమైంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్ దయాళ్ వికలాంగుల పునరావాస పథకం, వికలాంగుల హక్కుల అమలు పథకాలకు 2025-26 బడ్జెట్లో రూ.280 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ఆరు సంవత్సరాల నుండి నిధుల కేటాయింపులు క్రమంగా తగ్గుతున్నాయి. దేశంలో యువత మానసిక ఆరోగ్యం, జీవనశైలి, సోషల్ మీడియా వినియోగం, మానసిక ఆరోగ్య సంరక్షణపై బహిరంగ కార్యక్రమాలను నిర్వహించడం యువతలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కీలకమైన అంశమని ఆర్థిక సర్వే పేర్కొంది. కానీ కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన జాతీయ ఆరోగ్య మిషన్ వంటి కార్యక్రమాల అమలుకు ఆటంకం ఏర్పడుతున్నది. టెలిమానస్ కార్యక్రమం ద్వారానే మానసిక ఆరోగ్య సంరక్షణ సాధించడం ఆచరణలో సాధ్యం కాదు. 2017 మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టంలో పేర్కొన్న విధంగా అట్టడుగు ప్రజలకు వైద్య సేవలు అందించడం కీలకం. పని ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగు పరచకుండా, ఉద్యోగ భద్రత, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలను పరిష్కారం చేయకుండా మానసిక ఆరోగ్య సంరక్షణ గురించి ఎంత మాట్లాడినా ఉపయోగం ఉండదని పాలకులు గుర్తించాలి. టెలి మానస్, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అమలుపై దృష్టి పెట్టడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. మానసిక అనారోగ్యాన్ని అధిగమించేందుకు ప్రజల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. తగినన్ని మానసిక చికిత్స ఆసుపత్రులు ఏర్పాటు చేయడం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాటిలో సౌకర్యాలు మెరుగు పరచడం, శిక్షణ పొందిన నర్సులు, సోషల్ వర్కర్లు, సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు, కౌన్సిలర్లు, ఇతర ఆరోగ్య కార్యకర్తలను నియమించడానికి ప్రభుత్వం కృషి చేయాలి. మానసిక ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ బాధ్యత.

## విద్య రంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, తెలంగాణ దిశ:**రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని భీమారం మండలం కాజీపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజనం నాణ్యత పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య రంగా అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు సంక్షేమ వసతి గృహాలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారం శుద్ధమైన త్రాగునీటిని అందించాలని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం నిర్దేశిత విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని బిల్లుల చెల్లింపులు సులభతరం అవుతాయని తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్వాడి పరిధిలో గర్భిణులు బాలింతలు పిల్లల సంక్షేమం కొరకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని సకాలంలో లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. పిల్లల శారీరక మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోపం ఉన్న పిల్లలను గుర్తించి సాధారణ స్థితికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత తరగతి గదులు, వంటశాల వంట సామాగ్రి భద్రపరచు గది పరిసరాలను పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్య అందించడం జరుగుతుందని ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు.అనంతరం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు



ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించి వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్మిస్తున్న ఇంటర్మీడియట్ అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజల సౌకర్యార్థం వైద్య సేవలను వేగంగా మరింత మెరుగ్గా అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తుందని తెలిపారు.



# ఎరుపు రంగు ముల్లంగిని మీరు ఎప్పుడైనా తిన్నారా..?

## దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

మనకు లభించే అన్ని రకాల కూరగాయల్లోనూ వివిధ వెరైటీలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ముల్లంగిలోనూ పలు రకాలు ఉంటాయి. మనకు ఎక్కువగా తెలుపు, ఎరుపు రంగులో ఉండే ముల్లంగి లభిస్తుంది. సాధారణంగా చాలా మంది తెలుపు రంగు ముల్లంగినే తింటారు. కానీ ఎరుపు రంగు ముల్లంగి వల్ల కూడా మనకు అనేక లాభాలు కలుగుతాయి. ఈ ముల్లంగిలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. ఎరుపు రంగు ముల్లంగిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందుకనే అవి ఎరుపు రంగులో ఉంటాయి. కనుక ఈ ముల్లంగిని ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. ఎరుపు రంగు ముల్లంగిలో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. కనుకనే అవి ఆ రంగులో మనకు దర్శనమిస్తాయి. ఇవి శరీరాన్ని ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి రక్షిస్తాయి.

**రోగ నిరోధక వ్యవస్థకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని దూరం చేస్తాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఎరుపు రంగు ముల్లంగిలో విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. విటమిన్ సి వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. ఫలితంగా సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే విటమిన్ సి సహాయంతో శరీరం కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మాన్ని సంరక్షిస్తుంది. విటమిన్ సి వల్ల మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. మహిళలకు ఎంతగానో మేలు జరుగుతుంది.

**జీర్ణ వ్యవస్థకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ ముల్లంగిలో అధికంగా ఉండే నీటి శాతం వల్ల శరీరంలో ఉన్న వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. ఈ ముల్లంగిలో అధికంగా ఉండే నీటి వల్ల దీన్ని తింటే శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి.


జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. మెటబాలిజం మెరుగు పడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఎరుపు రంగు ముల్లంగి కిడ్నీలు, లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఆయా అవయవాలు డిటాక్స్ అవుతాయి. వాటిల్లో ఉండే టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. దీంతో లివర్, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. మూత్రం ధారాళంగా, సాఫీగా జారీ అవుతుంది. మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు, మూత్ర సంబంధిత సమస్యలు తగ్గుతాయి.

**బరువు తగ్గేందుకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్నవారు ఎరుపు రంగు ముల్లంగిని రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ ముల్లంగిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీని నియంత్రిస్తుంది. శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. దీని వల్ల హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇలా ఎరుపు రంగు ముల్లంగిని తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. దీన్ని నేరుగా లేదా ఉడకబెట్టి ఎలా తిన్నా సరే లాభాలు కలుగుతాయి.

# ఆదుకునే అత్యవసర నిధి!




డబ్బు అవసరం.. ఎప్పుడు, ఎలా వస్తుందో తెలియదు. వచ్చిన జీతం.. తిండి, ఇంటి కిరాయి, పిల్లల ఖర్చులకే సరిపోతుంది. ముఖ్యంగా మధ్య తరగతి జీవితాలన్నీ.. ఈఎంఐల చుట్టే తిరుగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో అనుకోని సంఘటన ఎదురైతే 'అప్పు' తప్ప మరే దారీ కనిపించదు. ఆ అప్పు పుట్టాలన్నా.. నానా తిప్పలు పడాల్సిందే! అందుకే.. ప్రతి కుటుంబం తమ ఆదాయం నుంచే అత్యవసర నిధి (ఎమర్జెన్సీ ఫండ్)ను ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే.. అనుకోని సమస్య ఎదురైనా, ధైర్యంగా బయటపడొచ్చు.లక్ష్యం పెట్టుకోవాలి : అత్యవసర నిధి కోసం ఎంత డబ్బు కావాలో ముందే లక్ష్యంగా పెట్టుకోవాలి. అలాగే ఎన్ని నెలల్లో దాన్ని సమకూర్చుకోవాలో కూడా ముందే నిర్ణయించుకోవాలి.బ్యాంకు అకౌంట్ : ఈ అత్యవసర నిధి కోసమే ప్రత్యేకంగా ఒక బ్యాంకు అకౌంట్ తెరవాలి. ఆ అకౌంట్‌ను పేమెంట్ యాప్స్‌తో లింక్ చేయకూడదు. ఎందుకంటే.. ఆ అకౌంట్‌ను తరచూ చెక్ చేస్తుంటే, డబ్బులు విత్ డ్రా చేయాలనిపించే అవకాశం ఉంటుంది.ఆటోమేటిక్ ట్రాన్స్‌ఫర్స్ : సాలరీ అకౌంట్ నుంచి అత్యవసర నిధికి చెందిన అకౌంట్లోకి నెలనెలా ఆటోమేటిక్‌గా డబ్బు వెళ్లేలా ఏర్పాటుచేసుకోవాలి. అప్పుడు ప్రతినెలా గుర్తు పెట్టుకుని.. అకౌంట్లో డబ్బు వేయాల్సిన పని ఉండదుతెలివైన వాడకం: అనుకున్నంత అత్యవసర నిధి జమయ్యాక.. ప్రతి చిన్న విషయానికీ దానిని ఖర్చు చేయకూడదు. వైద్యపరమైన సమస్య లు, ఉద్యోగసమస్యలు ఉన్నప్పుడు మాత్రమేఉపయోగించాలి. అంతేత ప్ప.నెలనెలా వచ్చే ఖర్చుకోసం వీటినిఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదు.



### ఈ పండ్లు మీకు బయట ఎక్కడ కనిపించినా సరే విడిచి పెట్టకుండా

# తెచ్చుకుని తినండి..

పండ్లంటే చాలా వరకు తియ్యగానే ఉంటాయి. అవి తియ్యగా ఉంటాయి కాబట్టే వాటిని తినేందుకు ఎంతో మంది ఆసక్తిని చూపిస్తుంటారు. అయితే కొన్ని రకాల పండ్లు అంత తియ్యగా లేకున్నప్పటికీ పోషకాలను మాత్రం అధికంగా అందిస్తాయి. అలాంటి పండ్లలో బేరి పండ్లు కూడా ఒకటి. వీటినే ఆంగ్లంలో పియర్ పండ్లు అని కూడా పిలుస్తారు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. బేరి పండ్లు లేత ఆకుపచ్చ లేదా పసుపు రంగులో ఉంటాయి. లోపల తెల్లని గుజ్జు ఉంటుంది. ఇది అంత తియ్యగా ఉండదు. కానీ బోలెడు లాభాలను మాత్రం అందిస్తుంది. ఈ పండ్లలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇవి మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి.

**జీర్ణ సమస్యలకు..:** పియర్ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఒక మీడియం సైజ్ పియర్ పండును తింటే సుమారుగా 6 గ్రాముల మేర ఫైబర్ లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధికంగా బరువు ఉన్నవారు పియర్ పండ్లను తరచూ తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ పండ్లు ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. అంటే వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. పియర్ పండ్లలో ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**కొలెస్ట్రాల్ సమస్యకు..:** పియర్ పండ్లలో ఉండే ఫైబర్ మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు ఈ పండ్లను రోజూ తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. పియర్ పండ్లు కాస్త తియ్యగానే ఉంటాయి. అయినప్పటికీ ఇవి తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువను కలిగి ఉంటాయి. అందవల్ల ఈ పండ్లను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్ ను తగ్గించడంలో సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

**చర్మ సంరక్షణకు..:** పియర్ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీని వల్ల చర్మానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. చర్మం తన సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. మృదువుగా మారి తేమగా ఉంటుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. పియర్ పండ్లలో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి కనుక ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ సమ్మేళనాలుగా కూడా పనిచేస్తాయి. దీని వల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. పియర్ పండ్లను కొందరు తొక్క తీసి తింటారు. కానీఈ పండ్లను తొక్కతోసహా తినాల్సి ఉంటుంది. పియర్ పండ్ల తొక్కలోనూ అనేక పోషకాలు ఉంటాయి. కనుక ఈ పండ్లను తొక్కతో తింటే ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి. ఇలా పియర్ పండ్లను తరచూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# క్షేమంగా వెళ్లిరండి..!

**వానాకాలం ప్రయాణాలు.. కొందరికి ఉత్సాహాన్ని అందిస్తాయి. మరికొందరిని అనారోగ్యాల బారిన పడేస్తాయి. మరీ ముఖ్యంగా.. గర్భిణులను మరింత ఇబ్బంది పెడుతాయి. ఈ సమయంలో వాళ్లు అత్యంత జాగ్రత్తగా మెలగాలని గైనకాలజిస్టులు సూచిస్తున్నారు. ప్రయాణాలు సాఫీగా సాగాలంటే.. కింది జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.**



డాక్టర్ సలహా మేరకు: గర్భిణులు ప్రయాణాలు చేసేముందు గైనకాలజిస్టును కలవడం తప్పనిసరి. మొదటి, చివరి త్రైమాసికంలో ప్రయాణాలను విరమించుకోవడమే ఉత్తమం. గర్భధారణ సమస్యలు ఉన్నప్పుడు ప్రయాణాలు రద్దు చేసుకోవాలి. గర్భిణులు ఎక్కడికి వెళ్లినా మెడికల్ రిపోర్టులు, అత్యవసర ఫోన్ నంబర్లను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి.

సరైన రవాణా: వానాకాలంలో రైళ్లు, బస్సుల్లో ప్రయాణించడం ఇబ్బందికరం. విమానంలో ప్రయాణించేటప్పుడు ఎయిర్‌లైన్స్ నిబంధనలను తప్పకుండా తెలుసుకోవాలి. గర్భం దాల్చిన 36 వారాల తరువాత విమానంలో ప్రయాణించకపోవడమే మంచిది. సొంత వాహనాల్లో వెళ్లడమే సురక్షితం.

ముందే తెలుసుకోండి: ప్రయాణాలకు సిద్ధమయ్యే ముందే.. వాతావరణ పరిస్థితులను తెలుసుకోండి. వెదర్ యాప్స్, వెబ్‌సైట్లను పరిశీలించండి. భారీ వర్ష సూచనలు ఉన్నప్పుడు ప్రయాణం వాయిదా వేసుకోవడమే మంచిది.

సౌకర్యంగా ఉండండి: వదులుగా ఉండే కాటన్ దుస్తులు వేసుకోవడం వల్ల.. ప్రయాణాల్లో సౌకర్యవంతంగా ఉంటుంది. వాటర్‌ప్రూఫ్ జాకెట్లు, గొడుగు కూడా వెంట ఉంచుకోవాలి. తడిగా ఉన్న చోట జారి కిందపడిపోకుండా.. యాంటి స్లిప్ చెప్పులు వాడండి. శుభ్రత పాటించాల్సిందే: వానాకాలంలో ఎక్కువగా మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, జీర్ణ సంబంధ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే, పరిశుభ్రత తప్పకుండాపాటించాలి. చేతులుశుభ్రం చేసుకోవడానికి శానిటైజర్లు, టవల్స్, టిష్యూలు, టాయిలెట్ సీట్ డిస్ ఇన్‌ఫెక్టెంట్ స్ప్రే వెంట ఉంచుకోండి. పబ్లిక్ టాయిలెట్లకు వీలైనంత దూరంగా ఉండండి.


సమతుల ఆహారం: వానాకాలంలో బయటి ఆహారం తినకపోవడం మంచిది. ముందుగానే కోసిపెట్టుకున్న పండ్లు, సలాడ్లు, మూతలేకుండా ఉంచిన ఆహారం తినడం మంచిది కాదు. నూనె, మసాలాలు, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తింటే.. లేనిపోని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఛాతీలో మంట, అజీర్ణం వంటివి ఇబ్బంది పెడతాయి. పరిశుభ్రమైన వాతావరణంలో చేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోండి.

# అందం కోసం.. అవి వాడొద్దు

ఆడవాళ్లు అందానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. అందునా.. ముఖ వర్చస్సుకు మెరుగులు దిద్దుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఇందుకోసం నానా రకాల సౌందర్య ఉత్పత్తులను ఆశ్రయిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్లకు క్యూ కడితే.. మరికొందరు ఇంటి చిట్కాలతోనే సరిపెట్టుకుంటారు. అయితే, కొన్ని సందర్భాల్లో తెలిసీతెలియకుండానే చిన్నచిన్న తప్పులు చేస్తుంటారు. ఏది పడితే అది ఇష్టారాజ్యంగా వాడేస్తుంటారు. అలా అందాన్ని చేతులారా పాడు చేసుకుంటారు. అలా కావొద్దంటే.. కొన్నిటిని పక్కన పెట్టేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాక్స్‌తో జాగ్రత్త!: ముఖంపై అవాంఛిత రోమాల్ని తొలగించుకోవడానికి చాలామంది 'వ్యాక్స్'ను ఆశ్రయిస్తారు. అయితే, సరైనదాన్ని ఎంచుకోవడంలో పొరపాటు పడుతుంటారు. మహిళల చర్మతత్వాన్ని బట్టి 'వ్యాక్స్'ను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సున్నిత చర్మం ఉండేవారు.. కఠినమైన వ్యాక్స్‌ను వాడటం వల్ల ముఖ వర్ఛస్సు దెబ్బతింటుంది. ముఖంపై దద్దుర్లు రావడం, ఎర్రగా మారడం, ముడతలు పడటం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ఫేషియల్ వ్యాక్స్ వేసుకునే ముందు.. ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవాలని చెబుతున్నారు.

నిమ్మ.. అలా వద్దు!: ఆరోగ్యంతోపాటు అందాన్ని కాపాడటంలోనూ 'నిమ్మ పండు' ముందుంటుంది. అయితే, చాలామంది దీనిని నేరుగా ముఖంపైనే అప్లయి చేస్తుంటారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. నిమ్మకాయలో ఉండే అధిక ఆమ్లత్వం.. చర్మానికి హాని కలిగిస్తుంది. ముఖం ఎర్రబడటం, చికాకు, దురద లాంటి సమస్యలు తలెత్తుతాయి.



అందులోనూ సున్నితమైన చర్మం, మొటిమలు ఎక్కువగా ఉన్నవాళ్లు.. నిమ్మకాయను నేరుగా వాడటం ఏమాత్రం మంచిది కాదు. దానికి బదులుగా తేనె, చక్కెర, నీటితో కలిపి నిమ్మకాయను చాలా తక్కువ మొత్తంలో వాడాలి. నిమ్మకు బదులుగా బంగాళాదుంప, టమాటా వంటివి ఎంచుకుంటే మరీ మంచిది.

అది బాడీ కోసమే..: చర్మానికి తేమను అందించే 'బాడీ లోషన్'ను.. చాలా మంది ముఖానికి వాడుతుంటారు. దీనివల్ల ముఖం జిడ్డుగా మారుతుంది. బాడీ లోషన్‌లోని జిడ్డుదనం.. ముఖ చర్మ రంధ్రాల్లోకి చేరి మొటిమలు రావడానికి కారణం అవుతుంది. బాడీ లోషన్‌లో వాడే రసాయనాలతో చర్మంపై అలర్జీలు వస్తాయి. కాబట్టి, బాడీ లోషన్‌ను కాళ్లు, చేతులు ఇతర శరీర భాగాలకు మాత్రమే అప్లయి చేసుకోవాలి. ముఖం కోసం.. ఫేషియల్ బ్యూటీ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

# చేతులు లేకపోయినా ఫుడ్ డెలివరీ..



### సంపాదనలో కొంత మేర దానం
### పెదవులతో కస్టమర్లకు ఫోన్ కాల్స్
### ఆదర్శంగా నిలుస్తున్న చైనీయుడు



బీజింగ్ : చైనాలోని హునాన్ ప్రావిన్స్‌కు చెందిన లీ జియాంగ్యాంగ్ (30) అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. గ్రామీణ నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన నాలుగేళ్ల వయసులోనే విద్యుదాఘాతం వల్ల రెండు చేతులను కోల్పోయారు. దీంతో వారి కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తన వంతు సాయం చేయాలనే ఆలోచనతో ఎనిమిదేళ్ల వయసు నుంచి కాలిగ్రఫీ ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. తన కాలి వేళ్లతో కాలిగ్రఫీ వర్క్‌ను విక్రయించి, కొంత సొమ్ము సంపాదించేవారు. లీ మీడియాతో మాట్లాడుతూ, జరిగినదానిని మార్చలేమని, తాను ముందుకు సాగక తప్పదని చెప్పారు. తనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. పిల్లల్ని కిండర్‌గార్టెన్ స్కూల్లో చేర్పించవలసి ఉండటంతో తాను జూలై నుంచి పార్ట్ టైమ్ ఫుడ్ డెలివరీ ఏజెంట్‌గా పని చేస్తున్నానని తెలిపారు. యూనిసైకిల్‌పై కస్టమర్ల వద్దకు వెళ్లి, ఫుడ్‌ను అందిస్తానన్నారు. మోచేతికి కట్టుకున్న ఫోన్‌ను పెదవులతో ఆపరేట్ చేసి, కస్టమర్లకు కాల్ చేస్తానని తెలిపారు. రెస్టారెంట్ల సిబ్బంది, కస్టమర్లు తనకు సహకరిస్తున్నారన్నారు. కొందరు తనకు టిప్స్ కూడా ఇస్తూ ఉంటారని చెప్పారు.




## ఒకే వెబ్‌సైట్‌పై అన్ని బీమా సంస్థల సేవలు

న్యూఢిల్లీ: బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ చైర్మన్ అజయ్ సేథ్.. బుధవారం బీమా సుగమ్ ఇండియా ఫెడరేషన్ (బీఎస్ఐఎఫ్) అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. 2047కల్లా అందరికీ బీమాతోపాటు ప్రధాన మంత్రి 'వికసిత్ భారత్ 2047' మిషన్ లక్ష్యాల సాధనలో భాగంగా దీన్నో ముందడుగుగా ఓ ప్రకటనలో ఐఆర్‌డీఏఐ పేర్కొన్నది. పాలసీదారుల సాధికారతకు కృషి చేస్తున్నట్టు అజయ్ సేథ్ ఇందులో తెలిపారు. అందరికీ బీమా ప్రయోజనాలు అందేలా, ఎక్కడా పారదర్శకత లోపించకుండా కావాల్సిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.ఒకే వేదికపై అన్నిరకాల బీమా సేవలను పాలసీదారులకు అందించేలా ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందిం చినట్టు అజయ్ సేథ్ వివరించారు. వివిధ సంస్థలు అందిస్తున్న విస్తృత శ్రేణి జీవిత, ఆరోగ్య, జనరల్ ఇన్సూరెన్స్ ప్లాన్లను ఇక్కడ ఎంపిక చేసుకోవచ్చు. పాలసీ ఎంపిక, కొనుగోలు దగ్గర్నుంచి క్లెయిమ్ సెటిల్మెంట్, రెన్యువల్‌దాకా కేవలం పాలసీ నెంబర్‌ను వినియోగించి ఎలాంటి పత్రాలు లేకుండానే సులువుగా పనిని పూర్తిచేసుకోవచ్చు.



## తగ్గిన పసిడి ధర

న్యూఢిల్లీ: బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపారు. ఫలితంగా ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.1,300 తగ్గి రూ.1,13, 800కి దిగొచ్చింది. పదిగ్రాముల పుత్తడి ధర రూ.1,800 ఎగబాకి రికార్డు స్థాయి రూ.1,15,100కి చేరుకున్న విషయం తెలిసిందే. బంగారంతోపాటు వెండి ధర రూ.1,670 తగ్గి రూ.1,31, 200కి దిగొచ్చింది.

## భగ్గుమన్న బంగారం, వెండి ధరలు.. నేడు రూ. 870 పెరిగిన పసిడి ధర..



బంగారం వెండి ధరలు తగ్గేదెలే అంటున్నాయి. ఒకదానితో ఒకటి పోటీపడు తూ పరుగులు తీస్తున్నాయి. నేడు గోల్డ్ ధరలు భారీగా పెరిగాయి. ఇవాళ తులం గోల్డ్ ధర రూ. 870 పెరిగింది.కిలో వెండి ధర రూ. 1000 పెరిగింది. ఈరోజు 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.11,193, 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.10,260 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 800 పెరిగింది. దీంతో రూ.1,02,600 వద్ద అమ్ముడవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 870 పెరిగింది.
దీంతో రూ. 1,11,930 వద్ద ట్రేడ్ అవుతోంది.విజ యవాడ, విశాఖ పట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 98,800 వద్దకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,07,770 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో ఈ రోజు కిలో వెండి ధర రూ. 1,44,000 వద్ద అమ్ముడవుతోంది. ఢిల్లీలో కిలో సిల్వర్ ధర రూ. 1,34,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

## ఏఐ ప్రాజెక్టులలోని 200 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించిన గూగుల్

గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్‌లో తొలగింపులు కొనసాగుతున్నాయి. వరుసగా గత మూడు నెలలుగా వివిధ విభాగాల్లో లేఆఫ్స్ ప్రకటించిన గూగుల్, తాజాగా 200 మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించింది. లేఆఫ్‌కు గురైన వారు జెమిని, ఏఐ టూల్స్ ప్రాజెక్టులలో ఉన్నవారే కావడం గమనార్హం. అయితే, ఎలాంటి సమాచారం లేకుండా, ముందస్తు హెచ్చరిక ఇవ్వకుండానే తమను ఉద్యోగాల నుంచి తొలగంచారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో గూగుల్‌లో ఉద్యోగ భద్రత, తక్కువ జీతం, యూనియన్ ప్రయత్నాలకు ప్రతీకారం తీర్చుకునే ధోరణిలో ఈ లేఆఫ్ ప్రక్రియ జరుగుతోందనే ఆందోళనలను పెరిగాయి. ముఖ్యంగా ఏఐ లాంటి అధునాతన టెక్నాలజీలో పురోగతి సాధించే ప్రాజెక్టులపై ఈ ఉద్యోగులను పనిచేస్తున్నారు. అయితే, తొలగించిన ఉద్యోగులకు నేరుగా గూగుల్‌తో సంబంధాలు లేవని, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ, సబ్-క్రాంట్రాక్ పద్ధతిలో ఉన్న ఉద్యోగులని కంపెనీ వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది.




# 'యూపీఐ క్రెడిట్ లైన్ ' సదుపాయం

ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం తన కస్టమర్లకు ప్రత్యేక యూపీఐ క్రెడిట్ లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. సూర్యోదయ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకుతో భాగస్వామ్యం ద్వారా 'పేటీఎం పోస్ట్‌పెయిడ్'ను ప్రారంభించింది. దీని ద్వారా వినియోగదారులు ఏదైనా అవసరానికి తక్షణ చెల్లింపులు చేయవచ్చు. 'ఇప్పుడు ఖర్చు చేయండి, వచ్చే నెలలో చెల్లించండి' అనే ట్యాగ్‌లైన్‌తో పేటీఎం పోస్ట్‌పెయిడ్ ఉపయోగించి వినియోగదారులు 30 రోజుల వరకు వడ్డీ లేని క్రెడిట్‌ను పొందవచ్చు. ఇది రోజువారీ ఖర్చులకు ఉపయోగపడుతుంది. వినియోగదారులు కేవైసీ పూర్తి చేసి, వారి యూపీఐ ఖాతాను సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో లింక్‌చేసి, యూపీఐ పిన్‌ను సెటప్ చేయడం ద్వారా పేటీఎం యాప్ నుంచి నేరుగా పేటీఎం పోస్ట్‌పెయిడ్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. ఈడిజిటల్ క్రెడిట్ లైన్ రూ.60,000 వరకుప్రీ-అప్రూవ్డ్ క్రెడిట్ పొందుతారు. దీనికి నెలరోజుల పరిమితి ఉంటుంది. ఈరుణాన్ని షాపింగ్, బిల్లుల చెల్లింపులు, రీఛార్జ్‌లు, బుకింగ్‌లు వంటి వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగించవచ్చు. వినియోగదారులకు 30 రోజుల వడ్డీ




లేకుండా వాడుకుని, తిరిగి చెల్లించే సదుపాయం ఉంటుంది. ఖర్చు చేసిన మొత్తానికి మాత్రమే నామమాత్రపు ఛార్జీలు వర్తిస్తాయి. అయితే, ఈ క్రెడిట్ సదుపాయాన్ని ఉపయోగించి పర్సన్ టూ పర్సన్(పీ2పీ) లావాదేవీలు చేసే అవకాశం ఉండదు.


# కొత్త ఐపీవోలు.. కొనుక్కోండి షేర్లు




సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూళ్ల తయారీ కంపెనీ సాత్విక్ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి రూ. 442%-%465 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 19న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 700 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 200 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 23న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 900 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. కంపెనీ లిస్టయితే రూ. 5,910 కోట్ల మార్కెట్ విలువను అందుకునే వీలుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను కేటాయించనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 477 కోట్లు సాత్విక్ సోలార్ ఇండస్ట్రీస్‌లో ఇన్వెస్ట్ చేయనుంది. ఒడిషాలోని గోపాల్‌పూర్ ఇండ్రస్టియల్ పార్క్‌లో 4 గిగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. మరో రూ. 166.5 కోట్లు అనుబంధ సంస్థ రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2025 జూన్30కల్లా 3.8 గిగావాట్ల సోలార్ ఫొటోవోల్టాయిక్ మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. సోలార్ ప్రాజెక్టులకు ఎండ్‌టుఎండ్ ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణ సంబంధ సర్వీసులను కంపెనీ సమకూర్చుతోంది. సౌర విద్యుత్(సోలార్ పవర్) ఆధారిత వ్యవసాయ నీటి పంప్ సిస్టమ్స్ అందించే జీకే ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి రూ. 145%-%153 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 19న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 65 కోట్ల విలువైన 42 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 23న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 465 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను విక్రయించనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో దాదాపు రూ. 323 కోట్లు కంపెనీ దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. సోలార్ పవర్ వ్యవసాయ పంప్ సిస్టమ్స్‌కు కంపెనీ పూర్తిస్థాయిలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కమిషనింగ్(ఈపీసీ) సేవలు సమకూర్చుతోంది. తద్వారా రైతులకు వీటికి సంబంధించిన సర్వే, డిజైన్, సప్లై, అసెంబ్లీ, ఇన్‌స్టలేషన్, టెస్టింగ్, నిర్వహణ తదితర ఏకీకృత సర్వీసులు అందిస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 98 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

# టెకీలకు హైదరాబాదే అడ్డా

హైదరాబాద్/బెంగళూరు: టెక్నాలజీ జాబ్ మార్కెట్‌లో బెంగళూరుకు హైదరాబాద్ గట్టి పోటీనిస్తున్నది. సీనియర్ ఇంజినీర్లకు, కొత్త బృందాల నిర్మాణానికి దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌నే కేంద్రంగా ఎంచుకుంటున్నాయి మరి. దీంతో డాటా ఇంజినీరింగ్, కృత్రిమ మేధస్సు (ఏఐ), రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) విభాగాలకు కేరాఫ్ అడ్రస్‌గా విరాజిల్లుతూ వస్తున్న బెంగళూరుకు హైదరాబాద్ వేగంగా ప్రత్యామ్నాయమవుతున్నదిప్పుడు. హైదరాబాద్‌కు సీనియర్ స్థాయి ఉద్యోగులను కంపెనీలు పంపుతున్నాయని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. బెంగళూరుతో పోల్చితే ఆయా ఉద్యోగుల వార్షిక జీతాలు హైదరాబాద్‌లో ఎక్కువగా పెరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ ఇంజినీరింగ్ ఉద్యోగుల జీతాలు ఈ ఏడాది 8.6 శాతం పెరిగి హైదరాబాద్‌లో రూ.30.4 లక్షలకు చేరాయి. బెంగళూరులో 5.6 శాతం వృద్ధితో రూ.33.8 లక్షలుగా ఉన్నాయని టీమ్‌లీజ్ సంస్థ తెలిపింది. అలాగే ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌డీ ఉద్యోగుల వేతనాలు హైదరాబాద్‌లో 11.1 శాతం ఎగిసి రూ.20 లక్షలకు చేరితే, బెంగళూరులో 6.5 శాతం పెరిగి రూ.24.5 లక్షలుగానే ఉన్నాయి. ఇక వేగంగా పెరుగుతున్న జీతాలు, భారీ సాలరీ ప్యాకేజీలేగాక.. జీవనశైలి, నివాసయోగ్యత కూడా బాగుండటం, ఖర్చులు తక్కువగా ఉండటం హైదరాబాద్‌పట్ల ఉద్యోగుల్లో డిమాండ్‌ను పెంచుతున్న అంశాలుగా నిలుస్తున్నాయని ఉద్యోగ నియామకాల కన్సల్టెన్సీ సంస్థ అడెకో భారతీయ మేనేజర్ సునీల్ చెమ్మన్‌కోటిల్ తెలిపారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడులపై లాభాలు, ఇతరత్రా సదుపాయాలు చిన్న కంపెనీలనూ ఆకర్షిస్తున్నాయని



చెప్పారు. విస్తరణకు వీలుగా నగరం చుట్టూ పెద్ద మొత్తంలో భూములు జీవన వ్యయం తక్కువగా ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు పరిమిత ఖర్చుల్లోనే కంపెనీల ఏర్పాటుకు అవకాశాలు పుష్కలంగా నెలకొల్పుతున్న జీసీసీలు. ఇప్పటికే 355 ఉన్నాయి. ఫార్మాస్యూటికల్, ఇంజినీరింగ్‌లకు హబ్‌గా పేరు అందుబాటులో పెద్ద ఎత్తున సాంకేతిక ప్రతిభ ఉన్న గ్రాడ్యుయేట్లు గూగుల్, మైక్రోసాఫ్ట్, జేపీమోర్గాన్, డీబీఎస్ బ్యాంక్, బాష్, హ్యుందాయ్ మొబిస్, ఈస్ట్‌మన్ కెమికల్, మెటా, గోల్డ్‌మన్ సాచ్స్ సంస్థలు తమ హైదరాబాద్ సెంటర్లను ఏఐ ఆర్‌అండ్‌డీ ల్యాబ్‌లుగా రూపాంతరం చేస్తున్నాయి. క్వాల్‌కామ్, మైక్రాన్, వెరిజోన్, ఏబీబీ వంటి అమెరికా, స్విస్ కంపెనీలతోపాటు ఎల్‌అండ్‌టీ వంటి దేశీయ సంస్థలూ హైదరాబాద్‌లో కార్యకలాపాలను బలోపేతం చేస్తున్నాయి.

# భారీగా లాభపడిన సూచీలు

ముంబై,: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. భారత్-అమెరికా దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతుండటంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ మళ్లీ 82 వేల మైలురాయిని అధిగమించింది. ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా ఎగబాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 594.95 పాయింట్లు లాభపడి 82,380.69 పాయింట్ల వద్ద లాభపడింది. మరో సూచీ నిఫ్టీ 169.90 పాయింట్లు అందుకొని 25,239.10 వద్ద స్థిరపడింది. వాణిజ్యంపై అమెరికా-భారత్ దేశాల మధ్య ప్రారంభమైన చర్చలు ఈసారి కొలిక్కి వచ్చే అవకాశాలుం డటం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీనికి తోడు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పావు శాతం తగ్గించే అవకాశాలుండటం కూడా కొనుగోళ్లకు ఉత్సాహాన్ని నింపిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. వచ్చేవారం నుంచి జీఎస్టీ నూతన రేట్లు అమలులోకి రానుండటంతో వాహన, కన్స్యూమర్ డ్యూరబు ల్ రంగ షేర్లు భారీగా పుంజుకున్నాయన్నారు. కొటక్ మహీంద్రా బ్యాంక్ షేరు 2.55 శాతం టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఎల్‌అండ్‌టీ, మహీంద్రా, మారుతి, భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, బీఈఎల్, టీసీఎస్‌లు ఒక్క శాతానికి పైగా బలపడ్డాయి.
అలాగే అదానీపోర్ట్స్, ఎస్బీఐ,టెక్‌మహీంద్రా, పవర్‌గ్రిడ్, టైటాన్, సన్‌ఫార్మా, రిలయన్స్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ, టాటా మోటర్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. రంగాలవారీగా సర్వీసెస్ సూచీ అత్యధికంగా 1.67 శాతం, టెలికాం 1.50 శాతం, వాహన రంగ సూచీ 1.43 శాతం, టెక్నాలజీ



1.05 శాతం, ఇండస్ట్రియల్స్ 1.05 శాతం, రియల్టీ 1.02శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.




## డెరివేటివ్‌ల్లోకి వ్యవసాయేతర కమోడిటీ..

ముంబై: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. నాన్-క్యాష్, నాన్-అగ్రికల్చర్‌కమోడిటీ డెరివేటివ్ మార్కెట్లలోబ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, పెన్షన్ ఫండ్స్ పెట్టుబడులను అనుమతించాలని యోచిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని చూస్తున్నట్టు బుధవారం సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. కాగా, నాన్-క్యాష్ సెటిల్డ్, నాన్-అగ్రికల్చరల్ కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టుల్లో ట్రేడింగ్‌కు ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీవో)ను అనుమతించాలన్న ప్రతిపాదననూ పరిశీలిస్తున్నట్టు ఇక్కడ ఎంసీఎక్స్ నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన చెప్పారు.
ఆర్థిక వ్యవస్థలో కమోడిటీ డెరివేటివ్ మార్కెట్లు కీలకపాత్ర పోషిస్తాయన్న పాండే.. ప్రపంచ స్థాయిలో ధరలను అనుసరించే స్థాయి నుంచి ఆ ధరలను నిర్ణయించే స్థాయికి భారత్ ఎదగాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ఇక డిసెంబర్‌కల్లా కాంప్లియెన్స్ రిపోర్టుల కోసం కామన్ రిపోర్టింగ్ మెకానిజంలో కమోడిటీ-స్పెసిఫిక్ బ్రోకర్లనూ సమ్మిళితం చేయనున్నట్టు పాండే ఈ సందర్భంగా తెలియజేశారు.

## రైల్లో సీట్ల వద్దకే ఫుడ్ డెలివరీ సేవలు

ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీ మేక్‌మైట్రిప్, ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటోతో కీలక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇరు సంస్థలు కలిసి 'ఫుడ్‌ఆన్ ట్రైన్' ఆఫర్ కింద ఇప్పుడు 130కి పైగా స్టేషన్లలో ఫుడ్ డెలివరీ సేవలను అందించనున్నాయి. మేక్‌మైట్రిప్ యాప్‌లో రైలు టికెట్ బుక్ చేసుకునే ప్రయాణికులకు ఈ సదుపాయం లభిస్తుంది. 'లైవ్ ట్రైన్ స్టేటస్' టూల్‌ను ఉపయోగించడం ద్వారా 'ఫుడ్ ఆన్ ట్రైన్' సేవలను ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అందిస్తామని, టిఫిన్, లంచ్, డిన్నర్, స్నాక్స్ వంటి సేవలందిస్తామని మేక్‌మైట్రిప్ బుధవారం ఒప్పందం సందర్భంగా వెల్లడించింది. మేక్‌మైట్రిప్ యాప్‌లో రైలు టిక్కెట్లను బుక్ చేసుకునే ప్రయాణికులు తమ ప్రయాణంలో ఆహారాన్ని కూడా ఆర్డర్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. జొమాటోతో భాగస్వామ్యం ద్వారా మరింత మెరుగైన సేవలను అందిస్తాం. మొబిలిటీ ఎకోసిస్టమ్‌లో వేగవంతమైన వినియోగ సేవలకు అవకాశం ఉంటుందని మేక్‌మైట్రిప్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రాజ్ రిషి సింగ్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రోజుకు 90 వేల కంటే ఎక్కువ మంది రైల్వే ప్రయాణికులు ఇండియన్ రైల్వేస్ ఈ-క్యాటరింగ్ సేవలను ఉపయోగించారు. ఇది అంతకుముందు ఏడాది కంటే 66 శాతం పెరిగింది. రైలు ప్రయాణికులు మేక్‌మైట్రిప్ ప్లాట్‌ఫామ్ నుంచి తమకు నచ్చిన రెస్టారెంట్ భోజనాన్ని ఆర్డర్ చేసుకునే వీలుంటుంది.




## అదానీ పోర్ట్స్, ఓఎన్‌జీసీని దాటి విలువైన కంపెనీగా ఎటర్నల్

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ కీలక మైలురాయిని చేరుకుంది. నాటి ర్యాలీ తర్వాత ఎటర్నల్ మార్కెట్ విలువ దాదాపు రూ. 3.16 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది దిగ్గజ అదానీ పోర్ట్స్, ఓఎన్‌జీసీ, ఆదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా మోటార్స్ లాంటి కంపెనీలను అధిగమించింది. సాయంత్రం మార్కెట్లు ముగిసే సమయానికి జొమాటో షేర్ ధర 1.19 శాతం పెరిగి రూ. 327.15 వద్ద ఉంది. గత నెలలో ఎటర్నల్ షేరు ధర 2.75 శాతానికి పైగా, గత మూడు నెలల్లో 31 శాతానికి పైగా పెరిగింది. ఈ నెల ప్రారంభంలో దేశీయ బ్రోకరేజ్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కూడా స్టాక్‌పై బుల్లిష్‌గా ఉన్నట్టు ప్రకటించింది. రానున్న రోజుల్లో షేర్ ధర రూ.420కి పెరగ వచ్చని విశ్లేషించింది. ఇటీవల జొమాటో ఆదాయం వేగంగా పెరుగుతుండటం, క్విక్-కామర్స్ విభాగం బ్లింక్‌ఇట్ నుంచి పెరుగుతు న్న రెవెన్యూ ద్వారా ఎటర్నల్ కంపెనీపై ఇన్వెస్టర్లకు విశ్వాసం పెరుగు తోంది. తాజా రూ. 3 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఎటర్నల్ నిఫ్టీ-50లో టాప్-25 జాబితాలో స్థానం దక్కించుకుంది. కంపెనీ మార్కెట్ క్యాప్ అదానీ పోర్ట్స్(రూ. 3.03 లక్షల కోట్లు),ఓఎన్‌జీసీ(రూ. 2.96 లక్షల కోట్లు), భారత్ ఎలక్ట్రానిక్స్(రూ. 2.94అదానీ ఎంటర్‌ప్రైజెస్(రూ. 2.77 లక్షల కోట్లు), విప్రో( రూ. 2.66 లక్షల కోట్లు), టాటా మోటార్స్( రూ. 2.63 లక్షల కోట్లు), కోల్ ఇండియా(రూ. 2.44 లక్షల కోట్ల) కంటే ఎక్కువగా ఉంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా దేశీయ అతిపెద్ద కంపెనీలలో కొన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ. 19.01 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ. 14.84 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ. 11.06 లక్షల కోట్లు) ఉన్నాయి.

## జీఎస్టీ తగ్గింపును వినియోగదారులకు బదలాయిస్తాం

ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ మదర్ డెయిరీ వినియోగదారులను గుడ్‌న్యూస్ ప్రకటించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను తమ పాల, ఆహార ఉత్పత్తులకు అమలు చేశామని, తగ్గిన పన్నుల మేరకు ధరలను సవరించినట్టు ప్రకటనలో వెల్లడించింది. ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గింపును వినియోగదారులకు పూర్తిస్థాయిలో బదలాయిస్తాం. పండుగ సీజన్‌లో చౌకగా తమ
ఉత్పత్తులు అందరికీ అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. తగ్గించిన ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ తెలిపింది. జీఎస్టీ రేట్ల మార్పు కారణంగా తమ పాలు, వివిధ రకాల ఉత్పత్తులు ఇప్పుడు జీరో ట్యాక్స్ లేదా 5 శాతం పరిధిలోకి వస్తాయి.



# తగ్గుతున్న ప్రాతినిధ్యం



భారతీయకార్పొరేట్ కంపెనీల్లో మహిళా డైరెక్టర్ల ప్రాతినిధ్యం తగ్గుతున్నదట. నిఫ్టీలో లిస్ట్ అయిన టాప్-100 కంపెనీల్లోని ఐదు శాతం సంస్థల్లో ఇప్పటికీ మహిళా ఇండిపెండెంట్ డైరెక్టర్లు లేరట. కార్పొరేట్ గవర్నెన్స్ సర్వే సంస్థ.. 'ఎక్సలెన్స్ ఎనేబ్లర్స్' తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం.. ఈ విషయాన్ని బయట పెట్టింది. గత మూడేళ్లుగా ఈ సంఖ్య క్రమక్రమంగా తగ్గుతున్నదనీ, అదే సమయంలో ఇండిపె ండెంట్ డైరెక్టర్ల సంఖ్య పెరుగుతున్నదని వెల్లడించింది. 'ఎక్సలెన్స్ ఎనేబ్లర్స్' సర్వే ప్రకారం.. భారతీయ కార్పొరేట్ సంస్థల్లో మహిళా డైరెక్టర్ల సంఖ్య.. 2021లో 57 ఉండగా.. 2022లో 56కు, 2023లో 54కు,2024లో 53కు పడిపోయింది. అయితే,మొత్తం డైరెక్టర్ల శాతంలో మహిళా డైరెక్టర్ల సగటు మాత్రం అలాగే (20 శాతం) ఉంది.

మహిళా స్వతంత్ర డైరెక్టర్లు మాత్రం.. 2021లో 101 మంది ఉండగా.. 2022లో 133, 2023లో 139, 2024లో 147కు పెరిగారు. కార్పొరేట్ కార్యాల యాల్లో సమర్థులైన మహిళలను గుర్తించడం, వారికి వృత్తిపరమైన పురోగతిని కల్పించినప్పుడే ఆయా సంస్థల బోర్డుల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని ఈ సర్వే చెబుతున్నది. అదే సమయంలో చైర్‌పర్సన్/ఎండీలుగా ఎదగడానికి, వివిధ బోర్డుల కమిటీలలో చేరి, వాటికి అధ్యక్షత వహించడంపైనా మహిళా ఉద్యోగులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని సూచిస్తున్నది.

# సంతానం.. సమస్యాత్మకం!



జెన్-జెడ్ మహిళల్లో 'సంతానోత్పత్తి' ఓ సమస్యగా మారుతున్నదట. పీసీఓఎస్, ఊబకాయం, వివాహం ఆలస్యమవడం, ఇతర కారణాల వల్ల.. 'సంతానోత్పత్తి'పై ఆందోళన చెందుతున్నారట. దాని కారణంగానే.. 51 శాతం మంది సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు సంతానోత్పత్తికి సంబంధించిన టెస్టులూ చేయించుకుంటున్నారట. దేశంలోని మెట్రో నగరాలు, ఇతర ప్రధాన నగరాల్లో తాజాగా నిర్వహించిన ఓ సర్వే.. ఈ విషయాలను వెల్లడించింది. ఈ సర్వేలో భాగంగా 200లకు పైగా జెన్ జెడ్ (23-30 ఏళ్ల వయసు) మహిళల నుంచి వివరాలు సేకరించారు. ఇందులో పాల్గొన్న వారిలో సగం మందికిపైగా.. 35 ఏళ్ల తర్వాత సంతానోత్పత్తి గణనీయంగా తగ్గుతుందని నమ్ముతున్నారు. పునరుత్పత్తికి సంబంధించిన ఆరోగ్య సమాచారం కోసం.. 41 శాతం మంది సోషల్ మీడియాపై ఆధారపడుతున్నారు. ఇక 28-32 ఏళ్ల మధ్య గర్భధారణ కోసం ప్రయత్నించాలని అనుకుంటున్నట్లు 40 శాతం మంది చెప్పుకొచ్చారు. మరో 25 శాతం మంది సంతానోత్పత్తికి సరైన సమయం, గర్భధారణకు సంబంధించిన అనుమానాలను తరచుగా లేవనెత్తుతున్నారు. ఎగ్ ఫ్రీజింగ్ గురించి విన్నట్లు 56 శాతం మంది జెన్ జెడ్ మహిళలు వెల్లడించారు. కానీ, వారిలో చాలామందికి దాని గురించిన పూర్తి అవగాహన లేదట. ఆర్థిక స్థిరత్వం సాధించడం, కెరీర్ కోసం సంతానాన్ని వాయిదా వేసుకోవాలని అనుకుంటున్నట్లు 10 శాతం మంది చెప్పుకొచ్చారు. చివరగా, 18 శాతం మంది జెన్-జెడ్ మహిళలు.. పిల్లలను కనకూడదని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు.. జెన్-జెడ్ మహిళల్లో సంతానోత్పత్తికి ప్రతిబంధకంగా పరిణమిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. ఫ్యాషన్ డైట్లను అనుసరించడం, ప్రిస్క్రిప్షన్ లేకుండా సప్లిమెంట్లను తీసుకోవడం కూడా.. సంతానోత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్య నుంచి బయటపడాలంటే.. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# పచ్చి మిర్చిని అసలు రోజుకు ఎన్ని తినవచ్చు..?

భారతదేశంలో చాలా మంది కారం ప్రియులు ఉంటారు. అధిక శాతం మంది కారంగా ఉండే వంటలను తినేందుకే ఇష్టపడుతుంటారు. అందుకనే భారతీయుల కూరలు చాలా కారంగా ఉంటాయి. ఇతర దేశీయులు మన వంటకాలను తినాలంటే అందుకనే భయపడతారు. అయితే ప్రస్తుతం కారం తినేవారు చాలా తగ్గిపోయారు. పిజ్జాలు, బర్గర్ల వంటి జంక్ ఫుడ్‌ను తింటూ అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు చిన్నతనంలోనూ కారం అధికంగా తినేవారు. కానీ ఇప్పుడు చిన్నారులు అసలు కారం తినడం మానేశారు. కారం తినడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రభావం పడుతుందని, అల్సర్లు వస్తాయని చాలా మందిలో ఒక నమ్మకం ఉంది. కనుకనే చాలా మంది కారం తినడం లేదు. అయితే ఇందులో కొంత మాట వాస్తవమే అయినా అల్సర్లు వచ్చేందుకు పూర్తిగా కారం తినడమే కారణం కాదు, ఇంకా అనేక కారణాలు కూడా ఉంటాయి. కానీ కారాన్ని రోజూ మోతాదులో తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

బరువు తగ్గేందుకు..: కారం అంటే మనం దీన్ని రెండు రకాలుగా తినవచ్చు. పచ్చి మిర్చి లేదా ఎండు కారం. ఈ రెండింటిలో దేన్ని తిన్నా సరే ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా పచ్చిమిర్చిలో పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి అనేక లాభాలను అందిస్తాయి. పచ్చి మిర్చిలో క్యాప్సెయిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీర మెటబాలిజంను పెంచుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది.

అధిక బరువు తగ్గుతారు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు నియంత్రణలో ఉండాలనుకునే వారు పచ్చి మిర్చిని తింటుంటే మేలు జరుగుతుంది. పచ్చి మిర్చిలో విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

గుండె ఆరోగ్యానికి..: పచ్చి మిర్చిలో ఉండే విటమిన్ సి వల్ల మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే విటమిన్ సి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. పచ్చి మిర్చిని తింటే శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పచ్చి మిర్చిలో ఉండే క్యాప్సెయిసిన్ అనే సమ్మేళనం యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. ఇది తీవ్రమైన నొప్పులు, వాపులను తగ్గిస్తుంది.

# ఆమిర్‌ఖాన్ కొడుకుతో సాయిపల్లవి..!





బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్‌ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్, స్టార్ నటిసాయి పల్లవి జంటగా ఒక సినిమా రుపోందుతున్న విషయం తెలిసిందే. మొదటగా ఈ సినిమాకు ఏక్ దిన్ అనే టైటిల్‌ను ప్రకటించిన తాజాగా టైటిల్‌ను మార్చినట్లు తెలిపారు. ఈ సినిమాను తాజాగా మెరే రహో అనే టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఇక ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా డిసెంబర్ 12న ప్రేక్షకులముందుకు రాబోతుంది. ఈసినిమాను ఆమిర్‌ఖాన్‌తో పాటు బాలీవుడ్ అగ్ర నిర్మాత మన్సూర్ ఖాన్ నిర్మిస్తున్నాడు. ఆమిర్‌ఖాన్ - మన్సూర్ ఖాన్ దాదాపు 17 ఏండ్ల తర్వాత ఈ సినిమాతో మళ్లీ కలుస్తున్నారు. వీరిద్దరి కలయికలో 2008లో వచ్చిన 'జానే తూ యా జానే నా' చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది.

# సినిమా..

## మృణాల్ ఠాకూర్ బ్యూటీ సీక్రెట్ ఇదే..!



'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలన కోరింది. ఇంతకీ ఆ నూనె ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్-ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది సహజ మాయిశ్చరైజర్‌లా పని చేస్తుంది. అంతేకాక, యాంటీ-ఏజింగ్ లక్షణాలు ఉండటం వల్ల చర్మం యువకంగా కనిపించడానికి తోడ్పడుతుంది.

వయస్సు ప్రభావాలు తొందరగా కనిపించకుండా అడ్డుకుంటుంది. ఇక కళ్ల కింద కనిపించే నలుపు వలయాలు, చర్మం ఉబ్బినట్లు కనిపించే సమస్యలకు కూడా బాదం నూనె సమర్థంగా పని చేస్తుంది. ఆ భాగంలో మృదువుగా మసాజ్ చేయడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృణాల్ ఖరీదైన కొనుగోలు చేయడం ఏమాత్రం నచ్చదట. ఖరీదైన బట్టలు కొనుగోలు చేసినా వాటితో ఎలాంటి ఉపయోగం లేకుండా దాచి ఉంచాల్సి వస్తుందని అభిప్రాయపడింది.

ఇప్పటి వరకు తాను కొనుగోలు చేసిన ఖరీదైన డ్రెస్ రూ.2వేలు మాత్రమేనని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. స్టార్ హీరోయిన్ అయినా తక్కువ ధరల్లోనే డ్రెస్‌లు కొనుగోలు చేస్తానని చెప్పడంతో అందరూ షాక్ అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ మూవీ ఈవెంట్స్, ఇతర ఫంక్షన్లకు హాజరైన సందర్భంలోనే ఖరీదైన వస్త్రాలను ధరిస్తుండగా.. వాటిని రెంట్ తీసుకొని ధరిస్తుందట.

భారీ ధర దుస్తులను కొనుగోలు చేయడం నచ్చదని.. బదులుగా ఆ డబ్బులను ఫుడ్, ప్రాపర్టీస్ కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తానని చెప్పడం విశేషం. మృణాల్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మృణాల్ మరాఠి కుటుంబంలో పుట్టి పెరిగింది. 2012 ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. కెరియర్ ప్రారంభంలో టీవీల్లో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులోకి 'సీతారామం'తో పరిచయమైంది.ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ సాధించడంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు మారుమోగింది. అయితే, అవకాశాలు మాత్రం ఎక్కువగా రాలేదు. టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్ నాని సరసన హాయ్ నాన్న, విజయ్ దేవరకొండ సరసన ఫ్యామిలీ స్టర్ సినిమాల్లో నటించింది. ప్రభాస్ కల్కి 2898 ఏడీ చిత్రంలో చిన్న పాత్రలో మెరిసింది. ప్రస్తుతం తెలుగులోకి అడివి శేష్ డెకాయిట్ : ఏ లవ్ స్టోరీతో పాటు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - అట్లీ కాంబినేషన్ లో రాబోతున్న చిత్రం AA22xcA6లో కీలక పాత్రలో నటించనున్నది. మరో రెండు హింద్రీ చిత్రాల్లో నటించనున్నది.

## తేజ సజ్జా లైనప్ మామూలుగా లేదుగా..



యంగ్ హీరో తేజ సజ్జా నటించిన తాజా పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. రేట్లు పెంచకుండానే, ఫస్ట్ డే ప్రపంచవ్యాప్తంగా రూ.27.20 కోట్లు, రెండో రోజు రూ.28.40 కోట్లు వసూలు చేసి, రెండు రోజుల్లోనే రూ.55.60 కోట్ల క్లబ్‌లోకి దూసుకెళ్లింది. స్టార్ హీరోలు సాధించలేని రేంజ్‌లో ఓ యంగ్ హీరో సినిమా ఇలాంటి కలెక్షన్స్ సాధించడం అందరిని ఆశ్చర్యపరిచింది. ఇక తేజ సజ్జా 'హనుమాన్'తో పాన్ ఇండియా రేంజ్‌ను టచ్ చేసి, రూ.300 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'మిరాయ్'తో ఆ రికార్డుల్ని తిరగరాయాలని భావిస్తున్నాడు. ఓవర్సీస్‌లోనూ ఈ చిత్రం దుమ్మురేపుతోంది. అమెరికాలో మిలియన్ డాలర్ క్లబ్‌లో చేరింది. అక్కడ థియేటర్ల సంఖ్య కూడా పెంచుతున్నారు. ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం, ఈ వీకెండ్ ముగిసేలోపు 1.5 మిలియన్ మార్క్ దాటే ఛాన్స్ ఉంది. ఈ సినిమా థియేట్రికల్ రైట్స్‌ను సాధారణ ధరలకే అమ్మిన నిర్మాతలు, నాన్ థియేట్రికల్ హక్కుల ద్వారానే రూ.20 కోట్లకు పైగా లాభాలు ఆర్జించారు. దీంతో బ్రేక్ ఈవెన్ టార్గెట్ బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఎవరూ టెన్షన్ పడాల్సిన పరిస్థితి లేదు. ఏపి, తెలంగాణలో సోమ, మంగళవారాల్లోనే బ్రేక్ ఈవెన్ దాటేసి లాభాల్లోకి వెళ్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రెండు వరుస బ్లాక్‌బస్టర్లతో (హనుమాన్, మిరాయ్) తేజ సజ్జా క్రేజ్ భారీగా పెరిగిపోయింది. ప్రస్తుతం తన నెక్స్ట్ ప్రాజెక్టులపై పూర్తి దృష్టి పెట్టాడు. 'జాంబీ రెడ్డి 2' కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తేజ, 'మిరాయ్ 2' కూడా చేయనున్నాడు. ఈ మూవీ స్క్రిప్ట్ పనులు ప్రారంభమయ్యాయి ఈ రెండు పూర్తైన తర్వాత 'జై హనుమాన్' అనే భారీ ప్రాజెక్ట్‌లో నటించనున్నట్లు సమాచారం. లవ్ స్టోరీలు, రొమాంటిక్ డ్రామాల్ని పక్కనబెట్టి, తేజ ఫాంటసీ, అడ్వెంచర్, డివోషనల్ థీమ్‌లపై దృష్టి పెట్టడం ఫిల్మ్ నగర్‌లో చర్చనీయాంశంగా మారింది. కొత్త హీరోగా తన మార్క్‌ను ప్రూవ్ చేసుకున్న తేజ సజ్జా, ఇప్పుడు స్టార్ స్టేటస్ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాడు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215